రెండు
ప్రపంచాల
దుబాయ్
ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 23, 2014
హాయ్ హాయ్
హాబీల హాయ్!

పల్లెటూరి అమ్మాయిలు!

ప ల్లెటూరి కథానాయిక అనగానే ... పొడవాటి జడలో మల్లెలు తురుముకుని...లంగా వోణీ వేసుకున్న గడసరి గుర్తొస్తే పాత రోజుల్లో వున్నట్టే. ఇవాళ గ్రామీణ కథానాయికలు మోడరన్ అమ్మాయిలకు ఏమాత్రం తీసిపోవడం లేదు. 'గోవిందుడు అందరివాడేలే, ఆగడు, కరెంటు తీగ, బృందావనం...' వంటి చిత్రాలను మననం చేసుకోండి. కాజల్ అగర్వాల్, తమన్నా, సన్నీ లియోన్, సమంత ... వంటి కథానాయికలు ఎంత ఆధునిక వస్త్రధారణతో కనిపిస్తారో! తల నిండా మల్లెలు తురుముకుని జామకాయలు తినే హీరోయిన్లు ఇప్పుడు లేరు. 'గోవిందుడు అందరివాడే'లో... ఓ చోట కాజల్ ... యాపిల్ పండు తింటూ ... కథానాయకుణ్ణి పిల్చి కబుర్లాడే దృశ్యం మర్చిపోలేం. "చిన్న చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి వేలాది మంది అమ్మాయిలు హైదరాబాద్ వచ్చి చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రంలోని అంజలి లాంటి పాత్రలను చాలా అరుదుగా చూస్తాం. యువత పల్లెల్లో స్థిరపడాలనుకోవడం లేదు. దీనికితోడు మారిన జీవన సరళిని సినిమాల్లోనూ చూపిస్తున్నాం...." అంటున్నారు దర్శకురాలు నందినీరెడ్డి. "అలాంటి గ్రామీణ పాత్రలను సృజించేప్పుడు అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుంటాడు దర్శకుడు. 'గబ్బర్ సింగ్, రామయ్య వస్తావయ్యా'లో శృతిహాసన్ పాత్ర అలా రూపొందించిందే" అంటారు సినీ దర్శకుడు హరీష్ శంకర్. "పల్లెల్లోనూ మార్పులొస్తున్నాయి. అయితే అవి తెరకెక్కేసరికి డోస్ ఎక్కువౌతుంటుంది"
అనేవారూ వున్నారు.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

నేమ్‌లో ఏముంది?

◆ మనలో మాట

'నేమ్‌లో ఏముంది బాస్?! విషయం వుండాలిగాని!' అంటారు కొందరు. 'అమ్మమ్మా! ...అది అంత తేలిగ్గా తీసి పారేయదగిన విషయమా. మనిషికైనా.. ప్రాణికైనా... వస్తువుకైనా... పేరుతోనే కదా గుర్తింపు! ఆ పేరుతోనేగా పిలుపూ...పలుకూ. అంత ముఖ్యమైన విషయాన్ని అలా కూరలో కరివేపాకులా తీసేయడం కుదిరే పనేనా?' అని కౌంటర్ కామెంట్ చేస్తుంటారు మరికొందరు.

నిజానికి ఇప్పుడు ఒక్కొక్కరికి ఒక పేరు కాదు! రెండేసి మూడేసి వుంటున్నాయి. ఇంట్లో ముద్దు పేర్లతో...స్కూళ్లు, కాలేజీల్లో, ఆఫీసుల్లో అసలు పేర్లతో చెలామణి అవుతున్నారు. నచ్చకపోతే మొహమాటం లేకుండా మార్చేసుకుంటున్నారు. మరి తాతముత్తాలు, తల్లిదండ్రులు 'పాత చింతకాయ పచ్చడి'లా అనిపించే పేర్లను పెడితే వూరుకుంటారా! కాలేజీలోనో, యూనివర్సిటీలోనో వుండగా ఆ పేరు మార్చేసి షోకైన పేర్లు పెట్టేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ అంత సులభంగా అయిపోతుందా! అదో పెద్ద ప్రహసనం!

పేరు మార్పు జరిగే సందర్భం మరోటి వుంది. అదే వివాహం. బాగా పాతకాలం నాటి పేర్లను మార్చుకోవడం ఒక పద్ధతి. కాబోయే భాగస్వామి తిథి వార నక్షత్రాలకు తగ్గట్టుగా మార్చుకోవడం మరో పద్ధతి. ఏ పద్ధతి ఫాలో అయినా ... పెళ్లి పత్రిక మీద పాత కొత్త పేర్లు రెండూ అచ్చొత్తించాల్సిందే. తమ పేర్ల మార్పును బంధుమిత్రులకు ఇలా తెలియచేస్తారన్నమాట.

సింగిల్ పేరున్న సినీ తారలు అరుదు. వారు చిత్రరంగ ప్రవేశం చేసేసరికే ఆ పేరుతో నటీనటులెవరైనా వున్నా...లేకున్నా...మార్చేసి కొత్త పేరు పెట్టేస్తారు దర్శక నిర్మాతలు. అదో సెంటిమెంటు! సొంత పేరుతో విజయాలు వరించలేదని మరో పేరు పెట్టుకునేవారూ వున్నారు!

కాలక్రమంలో మారిపోతున్న ఊళ్ల పేర్లు ఎన్ని చూడలేదు! వినలేదు! త్రివేండ్రం, మద్రాసు, కలకత్తా... తిరువనంతపురం, చెన్నై, కోల్‌కొతాగా మారిపోలా! తమ ప్రియతమ దివంగత నేతల స్మృతి చిహ్నంగా, గౌరవార్థంగా ... జిల్లాలు, కట్టడాలు, విద్యాలయాల పేర్లు మార్చమని ఎన్ని వత్తిళ్లు రావడం లేదూ?!

నిన్నటి పేట రౌడీ ... నేటి స్టేట్ రాజకీయ నాయకుడౌతున్నాడు. మరి రౌడీగా చెలామణి అయిన పేరుతోనే ఎన్నికల్లో నిలబడితే ఏం బావుంటుంది?! డ్రెస్సు మార్చినా అడ్రెస్సు (పేరు) అదే కనక ... ఓటు వేసేందుకు జనం వెనకాడే ఛాన్సుంది. అందుకే రౌడీయిజం స్థానంలో ... రాజకీయ పెద్దరికం ఉట్టిపడే పేర్లతో ఎన్నికల బరిలోకి దిగేస్తారు.

రాష్ట్రంలోనైనా, కేంద్రంలోనైనా... ప్రభుత్వాలు మారిన మరు క్షణంలోనే పథకాల పేర్లు మారిపోతుంటాయి. చేతి గుర్తు వారు పెట్టిన పేర్లను సైకిల్ మార్కు వారు హడావిడిగా మార్చేస్తారు. పచ్చ జెండా వారు పెట్టిన పేర్లను మువ్వన్నెల జెండావారు తీసేస్తారు. ఇందిరా క్రాంతి పథకం 'వెలుగు'గా మారినా ... పెన్షన్ల పథకం 'ఎన్టీఆర్ భరోసా'గా మార్చినా... పథకం ప్రజలకు అందితే చాలు! నేమ్‌లో ఏముంది!?



టపా

ఏం కోల్పోతున్నారో చెప్పారు

'కోల్పోతున్న బాల్యం' కవర్ స్టోరీ అనేక అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. బాల్యం బందిఖానాగా మారింది. స్వేచ్ఛ లేదు. పుస్తకాల మోత, తీరికలేని హోంవర్కు నిద్రలేమి పోటీ పరీక్షలు ఒక బందిఖానాగా మార్చేసాయి. తల్లిదండ్రులతో ఆప్యాయతగా మాట్లాడు కొనే అవకాశంలేదు. విద్య వ్యాపార వస్తువుగా మారింది.కార్పొరేట్ వ్యాపా రంలో బాలలు బతుకు ఈడుస్తున్నారు. ఆ రోజు అవసరమున్నా లేకపోయినా పుస్తకాల మోతలు తప్పలేదు. కొందరు పిల్లలు విసుగుచెంది ఇంటినుండి పారిపోతున్నారు. విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలి.

టి. శ్రీరామమూర్తి,గాజువాక , విశాఖ

కోల్పోతున్న బాల్యం వ్యాసం చాలా బాగుంది. ఈ తరం పిల్లలు ఏం కోల్పోతు న్నారో చక్కగా రాశారు. చిన్నారుల మనోవికాసానికి బాల సాహిత్యం ఎంతైనా అవసరం. ప్రజాశక్తితో పిల్లల కథలు గతంలోలా ఇస్తే బాగుంటుంది.

ఎన్.ఉమామహేశ్వరరావు, పార్వతీపురం.

మార్పు కోసమే ఆరాటం

స్నేహ కవర్ పేజీ కథనం బావుంది. ఎదుటి వాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయన్నాడు ఆత్రేయ. మనవాళ్ళు వట్టి వెధవాయ్‌లోయ్ అన్నాడు గిరీశం. రూల్స్‌ని బ్రేక్ చేయడంలో మనం ముందే ఉంటాం. ఈ వ్యాసం ద్వారా కొందరిలో మార్పు వచ్చినా మీ ప్రయత్నం ఫలించినట్టే. మంచి విషయం కవర్ స్టోరీగా ఇచ్చారు. మానవా..మారవా.. అంటే నేను మారనంటే మారను అని మారాం చేస్తాడు ప్రతీవాడూనూ. అప్పుల కుప్పలు బావుంది. అప్పు చేయకపోతే అప్పు లేకపోతే చేతగానివాడి కిందే లెక్క. ఉప్పు ముప్పు ఎంత? మనకు తగని వ్యాసం. గోంగూర బేరం కథ పరవాలేదు. సమయానికి గురజాడను గుర్తు చేశారు. స్నేహలో గళ్ళ.. నుడికట్టును ఇస్తే బాగుంటుంది. తుఫాను పేరు ఏదైతేనేం కవిత బావుంది.

స్నేహ లో బతుకుబండి కథ మారుతున్న నాగరికత ప్రభావాన్ని వివరించింది. కవర్ స్టోరీలో కోల్పోతున్న బాల్యం చాలా బావుంది. సంక్షోభంలో ధరల పెరుగుదల మంచి వ్యాసం ఇచ్చారు. ప్రేమ గూళ్ళు చదువుతుంటే ఏడుతరాలు (ద రూట్స్) పుస్తకం గుర్తుకువస్తుంది. శంకర్ గారి కార్టూన్ల గురించి విన్నాం. స్నేహ ద్వారా బొమ్మరిల్లు గురించి తెలుసుకొని సంతోషిస్తున్నాం.

బండి గోపాలకృష్ణ,
పి.గన్నవరం మండలం.

భరోసానిచ్చే యాప్స్

ఆపద సమయాల్లో ఆదుకునే యాప్ టెక్నాలజీ గురించి వచ్చిన సమాచారం ఉపయోగకరంగా వుంది. టెక్నాలజీ పరంగా వచ్చేవి ఎప్పటికప్పుడు తెలుసుకుంటేనే అన్నివిధాలా మంచిది. ముఖ్యంగా మహిళలకు ఉపయోగపడే యాప్స్ రావడం సంతోషంగానూ ఉంది. ఎలాంటి క్లిష్ట సమయాల్లో కూడా కుంగిపోకుండా ఓ రకమైన భరోసా నిచ్చేలా ఉంది వ్యాసం.

డి. మాధవి, విజయవాడ.

ప్రపంచీకరణ ముసుగులో

ప్రపంచీకరణకు చిన్నాభితకా బతుకులు ఎలా ఛిద్రమౌతాయో 'బతుకుబండి కథ' చదివితే స్పష్టంగా అర్థమైంది. అలాగే అది చదువుతుంటే తోటివారికి సాయం ఎలా చేయొచ్చో కూడా తెలిసింది. నిజంగా మూగవాడు, ఒక ముసలమ్మను చేరదీసి తన పనిలో సాయంగా ఉండమని చెప్పడం, అలా వాళ్లను తన దగ్గరే ఉంచుకోవడం చూస్తుంటే మానవత్వానికి సరైన అర్థంగా నిలిచాడు నటేశన్. వింతలోకంలో ఆకలి లేని పిల్లాడి గురించి చదివి ఆశ్చర్యపోయాం. రుచిలో వచ్చిన టిఫిన్లు కూడా బాగున్నాయి.

-ఎ.వి.రావు, విశాఖపట్నం.

ఈ సంచికలో....

హాబీల హాయ్ హాయ్

కవర్‌స్టోరీ 14

హాబీలు! అంటే తీరిక వేళల్లో సంతోషం కోసం వారు పెట్టుకున్న వ్యాపకాలు. మనోద్దీపకాలు. ఉల్లాస కారకాలు. ఇంగ్లీషులో హాయిగా హాబీ అనే పదాన్ని తెలుగులో వ్యాపకం అనొచ్చు. అయితే అది అవసరం కోసం గాక ఆనందం కోసం మొదలవుతుంది. అలవాటుగా స్థిరపడుతుంది. అలాటి ఆనంద వ్యాపకాలు తర్వాత ప్రధాన వ్యాపకాలుగా మారే సందర్భాలు వుంటాయి. అనుకోని రీతిలో అవి గొప్ప ప్రయోజనం కలిగించే ఘటనలూ వుంటాయి.

కథ 4
మిస్సింగ్

కార్టూన్ కదంబం 7

రుచి 8
పుట్టగొడుగులతో పలురకాలు

నవ్వుల్ - పువ్వుల్ 11

చూద్దామా 12
రెండు ప్రపంచాల దుబాయ్

సీరియల్ 18
ప్రేమ విప్లవం

కొత్తపుస్తకాలు 21
పాటల 'గోగు మల్లెలు'

బాలనేస్తాలు 22
బుజ్జిమేక-పందిపిల్ల కథ

సమ్‌థింగ్ స్పెషల్ 24
అన్నదానం చేసినందుకు అరెస్టు

సినిమా కబుర్లు 9
బాలీవుడ్‌లో
నట కుటుంబాలు

ఎర్రచందనం ఎంత అపురూపం!

ఎర్ర చందనం...శ్రీగంధం... పేరు వినని వారుండరు. ఇటీవలి కాలంలో ఈ చెట్టుకు ఎనలేని ప్రాముఖ్యత వచ్చింది. ఎర్రచందనం స్మగ్లింగ్ వార్తలేని రోజు బహుశా అరుదైంది. శ్రీగంధానికి వృక్షాలకు ఎందుకంత ప్రాధాన్యత? అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనంకు ఎందుకంత డిమాండ్ ఏర్పడింది? మన దేశం నుంచి ఈ ఎర్ర బంగారం ఇతర దేశాలకు ఎలా తరలిపోతున్నది? ఇతర దేశాలలో దీనిని ఎందుకు ఉపయోగిస్తారు? దీనివల్ల ప్రయోజనం ఏమిటి? అన్న కుతూహలం ఉంటుంది.

తిరుమల ఆలయం నెలవై ఉన్న శేషాచలం కొండలలో ఎర్ర చందనం పంట విస్తారంగా ఉంది. శేషాచలం అడవులకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచంలో మరెక్కడా ఈ అరుదైన వృక్ష జాతి ఇంత విస్తారంగా లేదు. ఇక్కడి నేల, వాతావరణం ఎర్ర చందనంకు అనుకూలంగా ఉండటంతో చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలలో లక్షల ఎకరాలలో విస్తరించి ఉంది. ప్రకాశం, కర్నూలు జిల్లాల అడవులలో సైతం ఈ ఎర్ర చందనం వృక్ష జాతి పాక్షికంగా ఉంది. రాష్ట్ర ఔషధ సుగంధ బోర్డు పరిధిలోకి ఈ వృక్షజాతి వస్తుంది. వెయ్యి మొక్కలు నాటి పది పదిహేనేళ్ళు వదిలేస్తే.......వర్షాధారంతోనే ఈ పంట పండుతుందని....కోటి రూపాయలు కనిష్టంగా ఆర్జించ వచ్చని అధికారులు చెబుతున్నారు. మొదటి రెండేళ్ళు ఈ చెట్లను జాగ్రత్తగా నీరు పోసి కాపాడాలంటున్నారు.

చైనా, జపాన్ దేశాల్లో ఎర్ర చందనం కొయ్యకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఎర్ర చందనం ఇంట్లో ఉంటే శుభం కలుతుందనే అభిప్రాయం ఈ దేశాలలో ఉండటం వల్ల ఎంత రేటయినా పెట్టి కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నారు. జపాన్‌లో సంగీత పరికరాలు, చైనాలో కొయ్య బొమ్మల తయారీకి వినియోగిస్తున్నారు. మలేషియా, సింగపూర్‌లలో ఎర్ర చందనంతో తయారు చేసిన వస్తువులంటే భలే మోజు. టన్ను ఎర్ర చందనం నుంచి కె.జి.టెరోపిబిలియన్ అనే రసాయనాన్ని తీస్తారు. దీని ధర వింటే కళ్ళు తిరుగుతాయి. కె.జి.టెరోపిబిలియన్‌కు మార్కెట్లో రెండున్నర కోట్ల రూపాయల ధర పలుకుతుంది.

లైంగిక సామర్థ్యం పెరగటానికి వయాగ్రా ఔషధంలా దీన్ని ఉపయోగిస్తారు. 20 మిల్లీ గ్రాముల గుళిక ధర 500 రూ॥లు పైమాటే ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, అగరబత్తీలు, సెంట్లు, ఔషధాలు, సబ్బులు, అలంకార సామగ్రి, సౌందర్య సాధనాలు, వయాగ్రా మాత్రల తయారీలో ఎర్ర చందనంను విరివిగా ఉపయోగిస్తుండటం వల్ల రోజురోజుకు డిమాండ్ ఊహించనంతగా పెరిగిపోతున్నది.

మధుమేహం నియంత్రణకు, దుష్టశక్తుల నుంచి విముక్తికి ఎర్ర చందనం ఉపయోగ పడుతున్నదని విదేశీయులు భావిస్తున్నారు.

చిత్తూరు, కడప జిల్లాలలో గ్రామీణ ప్రజానీకం ఎర్ర చందనం కొయ్యతో తయారు చేసిన రోకళ్ళను వినియోగిస్తారు. ఈ రోకళ్ళతో దంచిన





ఆహారం శ్రేష్టమైనదిగా భావిస్తారు.

ఎంత ఖరీదో!

◆ మార్కెట్లో కె.జి.ఎర్ర చందనం 30 వేల రూపాయలు ధర పలుకుతున్నది. గత 10 ఏళ్ళలో విదేశాలకు తరలి పోయిన అటవీ సంపద (ఎర్ర చందనం) రూ॥లు లక్ష కోట్లు పై మాటే.

◆ పట్టుబడింది రూ॥లు 65 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

◆ ఇటీవల చైనా నుంచి తిరుపతికి వచ్చిన ఒక వ్యాపారవేత్త టన్ను ఎర్రచందనానికి రూ॥లు 50 లక్షలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నానని అటవీ అధికారుల ముందు ప్రతిపాదన పెట్టారు.

◆ తిరుపతి అటవీ కార్యాలయంలో పట్టుబడ్డ 10 వేల టన్నుల ఎర్ర చందనం కొయ్యలు పేరుకుపోయి ఉన్నాయి. వీటిని అమ్మితే 5 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందటున్నారు.

అక్రమ రవాణా

◆ ఎర్ర చందనం వృక్షాలను ఎవరి అనుమతి తీసుకోకుండా విస్తారంగా పెంచుకోవచ్చు. చెట్లను నరకాలంటే మాత్రం ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి.

◆ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదవారిని, మహిళలను లోబర్చుకుని పెద్ద యెత్తున డబ్బులు ముట్టజెపుతామని గ్రామీణ పేదలను ఈ రొంపిలోకి దింపుతున్నారు స్మగ్లర్లు.

◆ ఎర్ర చందనాన్ని అక్రమార్కులు ఓడల ద్వారా ఇతర దేశాలకు తరలిస్తున్నారు. ఈ పద్ధతి కాక రైళ్ళ ద్వారా, కంటైనర్ల ద్వారా, విలాసవంతమైన కార్ల సీట్ల కింద దుంగలు రవాణా చేస్తున్నారు.

◆ శేషాచలం అడవుల్లో స్మగ్లర్ల దాడులతో కొన్ని ప్రాంతాలు మోడుబారిపోయాయి.

◆ ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను అరికట్టడానికి వెళ్ళిన అటవీ అధికారులు ముగ్గురు చనిపోగా, పోలీసు కాల్పుల్లో, దాడుల్లో 11 మంది కూలీలు చనిపోయారు.

◆ 2002 నుంచి 2014 వరకు 12 ఏళ్ళలో 8 వేలకు పైగా కేసులు కట్టారు. 10 వేల మందికి పైగా అరెస్టులు చూపారు. 6వేల వాహనాలు పట్టుకున్నారు.

◆ స్మగ్లింగ్‌లో పట్టుబడుతున్న వారు తమిళనాడు ప్రాంతానికి చెందిన గిరిజనులే అత్యధికులు. స్మగ్లర్ల ఎరకు ఆశపడి ప్రాణాలకు తెగించి, స్మగ్లింగ్ కార్యక్రమాలల్లో పాల్గొంటున్నారు. కె.జి. కొయ్యకు వందల రూపాయలు చెల్లిస్తుండటంతో పేద కూలీలు ఆశపడి సమిధలైపోతున్నారు.

◆ హత్య కేసుల్లో తగులుకుని బెయిల్ ఇచ్చే దిక్కు లేక ఎర్ర కూలీలు జైళ్ళలో మగ్గిపోతున్నారు.

◆ తమిళనాడులోని వేలూరు, తిరువణ్ణామలై, రెడ్‌హిల్స్, శేలం తదితర ప్రాంతాలలో స్మగ్లర్లు అధికారులతో కుమ్మక్కై ఎర్రచందనం గోడౌన్లు నడిపిస్తున్నారు.

అవినీతి... అరాచకం

◆ ప్రభుత్వం మొద్దుబారిపోయి ఉంటే స్మగ్లర్లు అధికారుల్తో గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

◆ ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎర్ర చందనం స్మగ్లింగ్ ఆగడం లేదు. కొత్త దారుల్లో స్మగ్లింగ్ నడుస్తున్నది. ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో నిర్విఘ్నంగా స్మగ్లింగ్ సాగుతుండడమే ఉదాహరణ.

◆ స్మగ్లర్లు వంట వండుకోవడం, సిగరెట్లు, బీడీలు తాగి అడవులలో పారేయటం, తుంటరి తనంతో అడవికి నిప్పు పెట్టటం వల్ల భారీ అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఒక దఫా టిటిడి, అటవీ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం మంటలను ఆర్పలేక చేతులెత్తేశాయి.కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, సైన్యం సహకారంతో మంటలను అదుపు చేయాల్సి వచ్చింది.

◆ ఈ దావానలంకు కొన్ని లక్షల చెట్లు ఆహుతైపోయాయి.అరుదైన జంతుజాలం వందల సంఖ్యలో పాములు అటవీ ప్రాణులు మంటలలో మాడిపోయాయి.

- కందారపు మురళి

మిస్సింగ్

■ కె. ఉషారాణి

◆ కథ

యమున అంటే బాపూ బొమ్మే. కాలేజీలో అంతా అలానే అనేవారు. చక్కని చామన చాయ రంగు. కొనదేరిన ముక్కు, తీర్చిదిద్దిన కనుబొమ్మలు, కల్మషం ఎరగని విశాలమయిన కళ్ళు. ఆటపాటలలో ముందుండే యమున పరిక్షలంటే మాత్రం వెనకడుగే. పాస్ కి ధోకా లేకపోయినా ఫస్ట్ క్లాసు లో ఎప్పుడూ తన పేరు చూసుకోలేదు. కలుపుగోలుగా ఉండే యమునంటే పరిచయస్తులంతా ఎంతో ఇష్టపడతారు. అలా ఓ స్నేహితురాలి పెళ్లిలో రాంబాబుతో పరిచయమే, స్నేహంగా మారి, రాంబాబు పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టే స్థాయికి ఎదిగింది. చివరికి ఇరు వైపులా పెద్దలు తథాస్తు అనక తప్పలేదు. ఫలితంగా యమున మకాం పుట్టిన ఆంధ్ర నడిబొడ్డు విజయవాడ నుండి తెలంగాణా రాజధాని హైదరాబాద్‌కి మారింది. మరి రాంబాబు ఉద్యోగం అక్కడే. డిగ్రీ ముగియడం, పెళ్లి, కొత్త కాపురం అంటూ మకాం మారడం అన్నీ చక చకా నెల రోజుల్లో జరిగిపోయాయి. ఓ కలే అనిపించింది యమునకి చాలా రోజులు. రాంబాబుతో కొత్త పేట లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న యమున, ఇప్పుడిక ఈ కొత్త వాతావరణానికి బాగానే అలవాటు పడింది. రాంబాబు మెడికల్ రిప్రెసెంటేటివ్. టూర్స్ పరిపాటి.

ఆ రోజు రాంబాబు అటెండ్ అవవలసిన కాల్స్ అన్నీ దూరప్రాంతంలోనే. అందుకే పొద్దున్నే తొందరగా తన టిఫిన్ ముగించుకుని, బయలుదేరాడు. ఆ రోజూ ఎప్పటిలాగానే మొదలయింది. పొద్దున్నే రాంబాబుకు కావలిసినవన్నీ అమర్చి, అతను బయటికి వెళ్ళిన తరువాత, మిగిలిన పనులు చూసుకునేందుకు వంటింటిలోకి వచ్చింది యమున. యమునకి, రాంబాబుతో పెళ్ళయి మూడేళ్లు. చైతు, ఉరఫ్ చైతన్య వారి గారాల పట్టి. యమున ఒడిలో పడి పదినెలలే. ముచ్చటగా ముద్దులొలుకుతుంటాడు. యమునకే కాదు ఆ ఫ్లాట్స్‌లోని అందరినీ తన బుడిబుడి నడకలతో మురిపిస్తాడు. బోసి నవ్వులతో సేదతీరుస్తాడు. కొత్త, పాత తేడా లేకుండా అందరినీ పలకరించి ఆడిస్తాడు. వాడికి పాలు పట్టి ఆడుకునేందుకు గిలకలను ముందేసి వంటింటి లోపలకు వచ్చింది యమున. నిండిన సింక్‌ని ఖాళీ చేసే పనిలో పడింది.పని చేసుకుంటున్న యమునకి పక్కింటిలో నుండి గిన్నెలు, గ్లాసులు రాకెట్ల లాగా ఎగిరి పడుతున్న శబ్దం వినిపిస్తూనే ఉంది. పక్కింటి అనసూయ భర్తపై కేకలు వేస్తున్నది. భర్తను శాపనార్థాలు పెడుతున్నది. ఇది యమునకి మామూలే . అనసూయ భర్త, రవి ఆటో డ్రైవర్. బాగా పొద్దు పోయే వరకు ఆటో నడిపి తెల్లవారు ఝామున ఇల్లు చేరుకుంటాడు,

"ఈ లోగా ఎందుకయినా మంచిదని ఎదురింటిలో, ఇంకా బడికి వెళ్ళకుండా ఉన్న టీచరు గారు పోలీసులకు ఫోన్ చేసారు. పది నిమిషాలు ఎవరికీ ఏమీ పాలుపోలేదు. పది నిమిషాలలో పోలీసు కానిస్టేబులు వచ్చాడు. ఇంట్లో ఉన్న పది నెలల పిల్లలను కూడా తల్లులు చూసుకోలేకుండా ఏమేడుస్తున్నారని దబాయించాడు. మళ్ళీ అన్ని ఫ్లాట్స్ గాలించారు, మరోసారి అందరు కలసి. యమునని రకరకాల ప్రశ్నలు వేస్తున్నారు. కేసు నమోదు చేసారు."

సగం మత్తులో. గొడవ చెయ్యడు. కానీ అనసూయకి ఈ అలవాటు నచ్చదు. ఆయన మానడు. పిల్లలు లేరు. పెళ్ళయి పదేళ్ళు దాటింది. ఆమెకు అదో బాధ. చైతు లాగే తనకూ ఓ పిల్లవాడు ఉంటె బాగుండేది కదా అని బాధపడుతూ ఉంటుంది. భర్తకు సుప్రభాతం పాడుతోందన్నమాట ఇప్పుడు. మాటల తూటాలు, భర్త అలవాట్లను దాటి అత్తవారి ఇంటి అలవాట్ల వైపు కదులుతున్నది. రాగం తారాస్థాయికి చేరుకుంటున్నది. గిన్నెల మోత మరింత స్పష్టంగా వినపడుతున్నది. మరో వైపు వైపు టీవీలో ఏదో చర్చా కార్యక్రమం జరుగుతున్నది. బయట నుండి ఆటో ల పరుగుల శబ్దం దూరంగా వినిపిస్తున్నది. బడి బస్ లో పిల్లలను ఎక్కించి తల్లులు ఇల్లు చేరుకోవడం ఎదురుగుండా కిటికీ లోంచి కనిపిస్తున్నది.

ఆ ఫ్లాట్స్‌లో మూడు అంతస్తులు. ఒక్కో అంతస్తులో, చతురస్రాకారం లో రెండు రెండు పడకల ఫ్లాట్స్ ఎదురెదురుగా వుంటే, రెండు మూడు పడక గదులున్న పోర్షన్లు వాటి మధ్యలో ఉన్నాయి. విశాలమయిన మెట్లు. లిఫ్ట్. మధ్యలో మొక్కలు. వీధి వైపుఉన్న బాల్కనీలు చిన్నవైనా లోపలి వరండాలు విశాలంగా ఉంటాయి. యమున ఉండేది మొదటి అంతస్తులో. మధ్యాహ్నం పనులైన తరువాత, మహిళలందరి కాలక్షేపం అక్కడ మధ్యలో ఉన్న వరండాలలోనే. బట్టలు ఆరవేస్తూ కష్టాలు, సుఖాలు పంచుకుంటూ ఉంటారు. యమున ఉంటున్న ఫ్లాట్ ఎదురు ఫ్లాట్స్ లో ఓ బ్యాంకు క్లర్క్ కుటుంబం, ఓ టీచరు కుటుంబం

“కింద ఉన్న యమున గబగబా పైకి వచ్చింది. హడావుడిలో వీధి తలుపులు వీయనేలేదని అప్పుడే గుర్తుకు వచ్చింది. కనీసం తలుపు గడియ వేద్దామని ఇంటికి వచ్చింది. లోపలకి అడుగు పెట్టంగనే హాలులో నీటి మడుగు. బెడ్ రూమ్ నుంచి వస్తున్నాయి. లోపలి వెళ్లి చూసేసరికి మంచం కింది నుండి నీరు బయటికి వచ్చి చేరుతున్నట్టు గమనించింది. యమునకి ఏమీ అర్థం కాలేదు. ఈ నీరెలా వచ్చిందా అని మంచం కిందికి తొంగి చూసింది. యమున కళ్లు విచ్చుకున్నాయి.”

ఉంటాయి. వారికి ఇద్దరికీ ఇద్దరేసి మగ పిల్లలు. అంతా ఆరు నుండి పదేళ్ళ వయసులోపు వారే. అందరూ సాయంత్రం క్రికెట్ ఆడేది కిందనే ఉన్న స్థలంలో. వాళ్ళు కూడా చైతుతో ఆడుకునేందుకు వస్తూనే ఉంటారు. పిల్లలందరూ కలిసి సాయంత్రం ఆటలతో, పోట్లాటలతో అపార్ట్‌మెంట్ హోరెత్తిస్తుంటారు. ప్రస్తుతం బడికి వెళ్ళే పిల్లలంతా స్కూళ్ళకెల్లడంతో అక్కడి వాతావరణం కాస్త ప్రశాంతంగా ఉంది. పక్కనున్న మూడు పడక గదుల వాటాలలో పిల్లలు కాస్త పెద్ద వాళ్ళు. కాలేజీ చదువులలో ఉన్నారు. వాళ్ళ గొడవలో వాళ్ళు ఉంటారు .

ఏదో ఆలోచనలలో ఉండి, గిన్నెలు కడుగుతున్న యమునకి అకస్మాత్తుగా, గదిలో నిశ్శబ్దాన్ని గమనించి ఉలిక్కి పడింది. పిల్లవాడు ఇంత నిశ్శబ్దంగా ఉండడం అంటే ఏదో పాడు పనిలో బిజీగా ఉండి ఉండాలని అనుకుంటూ చేతులు తుడుచుకుని హాలు లోకి వచ్చి చూసింది. చైతు అక్కడ లేడు. వాడి గిలకా లేదు. వీధి తలుపు వేయడం మరిచినట్టుంది. తలుపు తెరిచే ఉంది. ఇల్లంతా కలయతిరిగింది. చైతును పిలుస్తూ. ఉహు. నిశ్శబ్దం. ఎక్కడా అలికిడి లేదు.

గబగబా అనసూయ ఇంటి తలుపు తట్టింది అనుమానంగానే. పిల్లడు వాళ్ళింటికి వేళ్ళాడేమో అని. అనసూయకు వాడు అలవాటే. రవి కూడా బాగానే ఆడిస్తాడు. కానీ వాళ్ళింటి నుంచి వస్తున్న శబ్దాలు చైతు అక్కడున్నట్టు సంకేతాలు ఇవ్వడం లేదు. అయినా తన అనుమానం నిర్ధారించుకునేందుకే తలుపు తట్టి నిలుచుంది. ఇంటి నుండి వస్తున్న శబ్దాలు ఆగాయి.

అనసూయ తలుపు తీయంగానే “చైతు మీ ఇంటికేమయినా వచ్చాడా ” అని వాకబు చేసింది. అనసూయ రాలేదంటూనే, తనూ బయటకు వచ్చింది.

చైతు పాకుతూ మెట్లు దిగాడా? ఇరుగు పొరుగులు ఎవరయినా ఇంట్లోకి తీసుకెళ్ళారా ? అంతా అయోమయంగా, కంగారుగా ఉంది. అనసూయ, “పద నేను వస్తాను. ఇద్దరం కలిసే వెతుకుదాం” అంటూ యమునకి సాయంగా బయలుదేరింది. ఇద్దరూ కలిసి ముందు ఎదురుగా ఉన్న రెండు పడకల ఇళ్ళ తలుపులు తట్టారు. ఉహు. చైతు అక్కడ లేడు.

ఎనిమిదేళ్ళ కిరణ్ జ్వరమని బడికి వెళ్ళలేదు. వాళ్ళమ్మతో డాక్టర్ దగ్గరికి వెళ్లి అప్పుడే వచ్చారు. ఆమె “చైతు మహా చురుకు కదా, అందరి దగ్గరకు చనువుగా వెళ్ళడం వలన ఇటువంటి అపాయం ఉంది, అందువలన అలా అలవాటు చేయకుండా ఉండవలసింది” అని ఓ ఉచిత సలహా పారేసింది.

ఆ తరువాత, పక్కనున్న మూడు పడకల పోర్షన్‌లలో కనుక్కున్నారు. ఆంటి పనిలో ఉన్నట్టున్నారు. తలుపు తీసి చైతు సంగతి అడగగానే, “పొద్దున్న ఎనిమిదింటికి మా పిల్లల ఆటో వరకు నేను చైతును తీసుకెళ్ళి, వాళ్ళకు చైతు టాటా చెప్పాక మీ ఇంట్లో విడిచి పెట్టాను” కదా! అన్నారు. నిజమే. ఆ తరువాతే కదా చైతుకి పాలు పట్టింది. వాళ్ల పక్కనే ఉన్న బ్యాంకు క్లర్క్ తలుపు తట్టారు ఆయన భార్యను అడగంగానే, చుడలేదంటూనే గొణుగుతున్నది. “పిల్లలను ఆ మాత్రం శ్రద్ధగా చూసుకోవడం రాకపోతే ఎలా” అంటూ.

ఆ తరువాత రెండో అంతస్తులో ఉండే సావిత్రి అంటీ, “అసలే రోజులు బాగాలేవు. పిల్లలను ఎత్తుకుపోవడం, డబ్బులు దండుకోవడం చూస్తూ ఉన్నాం కదా! తలుపు వేసుకుని ఉండవలసిందని, వేయక పోవడం అజాగ్రత్తే” అని తీర్మానించింది.

ఇక ఆమె పక్కనే ఉండే మహాలక్ష్మి అక్కా, “పిల్లలను అమ్మడం ఈ రోజుల్లో సర్వసాధారణంగా మారిందని” మొన్నే ఓ పత్రికలో చదివాను.“పైగా వారిని అంగ వికలులను చేసి వారితో బిక్షం ఎత్తుకునేట్టు చేస్తున్నార”ట అంది విచార వదనంతో.

“పిల్లలను మేలుకున్నా, నిద్ర పోతున్నా కంటికి రెప్పలా కాయాల్సిందే” నని వారి పక్కనున్న తాయారు బామ్మగారి వక్కాణింపు.

ఆ పై రెండో అంతస్తులోనే ఉన్న తాతగారి గుమ్మం తట్టారు. అసలే “కాలు సాగుతున్న పిల్లవాడు కదా ఇంత అజాగ్రత్త తగునా ! “అని రిటైర్ అయిన పోలీస్ తాతగారి మందలింపు. వాళ్ళ ఇంటిలోనే ఉండి ఉద్యోగం వేటకి అక్క ఇంటికి వచ్చిన అనిల్ వెంటనే బయటకు చొక్కా వేసుకుని వచ్చాడు. నాలుగు వైపులా చూడవలసి వస్తుందేమో అని. రెండో అంతస్తులో ఎవరి ఇంటిలోనూ లేడని తెలియంగానే యమున కంగారు మరింత పెరిగింది. చమటలు పడుతున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. నోరెండిపోతున్నది. మూడో అంతసుకు ఎక్కే అవకాశాలు చాలా తక్కువ. అయినా అక్కడ కూడా అడగ కుండా ఉండలేక పైకి ఎక్కింది.

అబ్బే. తన ఉహ నిజం మూడో అంతస్తు ఎక్కనే లేదు . అక్కడ ఎవరింటి లోను లేడు. అందరూ పిల్లల పెంపకం లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఒకొక్క విధంగా చెప్తున్నారు. యమునా కన్నీరు ఆగడం లేదు. తన చిన్నారి ఏమయ్యాడన్న ఆలోచనతో ప్రాణాలు పైనే పోయాయి. తన ఏమరుపాటుకు తిట్టుకుంది. ఓ చిన్న పొరపాటుకు పెద్ద శిక్ష పడకూడదు అని అందరు దేవుళ్ళకు, వెంకటేశ్వరుడికి ప్రత్యేకంగానూ మొక్కేసుకుంది. మామూలుగా యమున ఎప్పుడూ పూజలే చేయదు. అందరిళ్ళు వెతకడం అయిపొయింది. చైతు ఎక్కడా లేడు. ఏం చేయాలో యమునకి పాలు పోలేదు. అనసూయ ఇంటికి వచ్చి రవిని లేపింది . తనూ కంగారు పడుతున్నది .

యమున ఇక లాభం లేదని రాంబాబుకి ఫోన్ చేసి, ఏడుస్తూనే విషయం చెప్పింది. రాంబాబు యమునకు ధైర్యం చెప్పాడు. “నేను వచ్చి చూసుకుంటాను కంగారు పడకు” అన్నాడు. రాంబాబు కాల్స్ అన్నీ విరమించుకుని ఇంటి దారి పట్టాడు. మనసులో కాస్త కంగారు ఉన్నా పైకి గంభీరంగానే ఉన్నాడు.

ఫ్లాట్స్ లోని వాచ్‌మెన్, ఎక్కడికి వెళ్ళకుండా ఆ సమయంలో ఇళ్ళల్లో మిగిలి ఉన్న రిటైర్ అయిన మగవారు, ఇళ్ళకు వచ్చిన అతిధులు, ఇలా ఉన్న మగవారంతా చొక్కాలు వేసుకుని తలో దిక్కు పరుగులు తీసారు చైతు కోసం .

ఈ లోగా ఎందుకయినా మంచిదని ఎదురింటిలో, ఇంకా బడికి వెళ్ళకుండా ఉన్న టీచరు గారు పోలీసులకు ఫోన్ చేసారు. పది నిమిషాలు ఎవరికీ ఏమీ పాలుపోలేదు. పది నిమిషాలలో పోలీసు కానిస్టేబులు వచ్చాడు. ఇంట్లో ఉన్న పది నెలల పిల్లలను కూడా తల్లులు చూసుకోలేకుండా ఏమేడుస్తున్నారని దబాయించాడు. మళ్ళీ అన్ని ఫ్లాట్స్ గాలించారు, మరోసారి అందరు కలసి. యమునని రకరకాల ప్రశ్నలు వేస్తున్నారు. కేసు

నమోదు చేసారు. కంట్రోల్ రూం వైర్లెస్ ద్వార విషయం అన్ని కేంద్రాలకు తెలియచేసింది. అప్పటికే జ్వరం అని బడికి వెళ్ళని కిరణ్, ఓపిక చేసుకుని ఫేస్ బుక్‌లో "మిస్సింగ్" అని చైతు ఫోటో అప్లోడ్ చేసాడు. వెతికేందుకు వీలుగా షేర్ చేసారు చాలామంది స్నేహితులు, తెలిసిన వారు కూడా. వాట్స్ అప్ లోకూడా లోడ్ చేసారు 'మిస్సింగ్' అని. బంధువులకు, స్నేహితులకు మెసేజెస్ పంపించారు. సురేష్ మూడో అంతస్తులో ఉంటాడు అతని స్నేహితుడు ఓ టీవీ ఆఫీసులో పనిచేస్తాడు. సురేష్ అతనికి ఫోన్ చేసి టి.వి లో స్క్రోలింగ్ వేయించమన్నాడు. బ్రేకింగ్ వార్తల కోసం ఎదురు చూస్తున్న చానళ్లకి వార్త దొరికింది. వెంటనే చానెల్ లలోబ్రేకింగ్ న్యూస్ అంటూ వార్త ప్రసారం అయ్యింది. "పది నెలల బాబు అపహరణ" అంటూ స్క్రోలింగ్ వచ్చేసింది. మిగిలిన చానల్స్ కూడా వెనక పడకూడదు అని వారు స్క్రోలింగ్ ఇచారు. కొన్ని చానల్స్ వారు కెమెరా తో సహా హాజరయ్యారు. వివరాలు అడిగేందుకు కథనాలు ప్రసారం చేసేందుకు. ఇది వరకు జరిగిన మిస్సింగ్ కేసులు, పరిశోధనలు వరసగా చూపిస్తున్నారు. టి.వి. చూసిన యమున అమ్మ,నాన్న కంగారుగా యమునకి ఫోన్ చేసారు. యమునా బావురు మనింది. వెంటనే బయలు దేరుతున్నామని ధైర్యం చెప్పారు. రాంబాబు స్నేహితులు, తల్లితండ్రులు, చుట్టాలు రాంబాబుకు ఫోన్స్ చేసి విషయం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరసగా ఒకదాని తరువాత ఒకటి కాల్ అటెండ్ అవుతున్నాడు రాంబాబు తిరుగు ప్రయాణం లోనే. యమున పరిస్థితి అందుకు భిన్నంగా ఏమి లేదు. ఓవైపు పిల్లాడి గురించి ఆందోళన. మరో వైపు ఫోన్లలో సమాధానాలు చెప్పడం.దాదాపు నిశ్శబ్దంగా ఉన్న బిల్డింగ్ అంతా ఒక్క సారి గందరగోళంగా మారింది. చేరగలిగిన స్నేహితుల, బంధువుల కార్లు, బైక్‌లతో ఫ్లాట్స్ కి చేరిపోతున్నారు. ఫ్లాట్స్ దగ్గర అలజడి మొదలయ్యింది. పోలీసులు రంగప్రవేశం చేయనే చేసారు .

కింద ఉన్న యమున గబగబా పైకి వచ్చింది. హడావుడిలో వీధి తలుపులు వీయనేలేదని అప్పుడే గుర్తుకు వచ్చింది. కనీసం తలుపు గడియ వేద్దామని ఇంటికి వచ్చింది. లోపలకి అడుగు పెట్టంగనే హాలులో నీటి మడుగు. బెడ్ రూమ్ నుంచి వస్తున్నాయి. లోపలి వెళ్లి చూసేసరికి మంచం కింది నుండి నీరు బయటికి వచ్చి చేరుతున్నట్టు గమనించింది. యమునకి ఏమీ అర్ధం కాలేదు. ఈ నీరెలా వచ్చిందా అని మంచం కిందికి తొంగి చూసింది. యమున కళ్లు విచ్చుకున్నాయి ఆనందంతో.

చైతు గిలకతో సహా హాయిగా నిద్రపోతున్నాడు మంచం కిందే. బహుశా గిలకతో పాకుతూ మంచం కింది కెళ్ళి నిద్ర వచ్చి పడుకున్నాడేమో! యమునకు, ఆనందం తో పాటు దుఖం, కోపం, కూడా ఒకే సారి కలిపి వచ్చాయి. రాంబాబు కూడా అప్పుడే వచ్చాడు ఇంటిలోపలికి. అతనితో పాటే మిగిలిన ఫ్లాట్స్ లోని వారు, బలగం, పోలీసులు కూడా వచ్చారు. యమున అప్పుడే మంచం కింది నుండి బయటకు తీసి ఎత్తుకున్న చైతును చూసి అంతా అవాక్కయ్యారని మళ్లీ చెప్పాలా! చైతు మాత్రం ప్రశాంతంగా నిద్ర పోనివ్వకుండా లేపినందుకు విస్సుగ్గా కళ్ళు తెరిచి చుట్టూ ఉన్న జనాన్ని ఒక సారి చూసి ఎత్తుకున్నది అమ్మే అని నిర్ధారించుకుని, మళ్లీ అమ్మ వీపుపై హాయిగా కళ్ళు మూసుకుని తన నిద్రను కొనసాగించాడు. వార్తల వేగానికి ఒక్కొక్క సారి నిజాలు మాటున పడే ప్రమాదం కూడా లేకపోలేదు కదా! అయితేనేం మళ్లి బ్రేకింగ్ న్యూస్‌లో 'చైతు ఫౌండ్ అవుట్' అని కూడా రావచ్చు!! ■

◆ కార్టూన్ కదంబం





పుట్టగొడుగులతో పలు రకాలు

మష్రూమ్ కర్రీ

కావలసిన పదార్థాలు : పుట్ట గొడుగులు: పావుకిలో, ఉల్లిపాయలు: మూడు, పచ్చిమిర్చి :మూడు, కారం : టీ స్పూను, పసుపు : పావు టీ స్పూను, కొత్తిమీర : కట్ట, నూనె : వేయించడానికి: సరిపడా, ఉప్పు: తగినంత. మసాలా ముద్ద కోసం: అల్లం తురుము : టీ స్పూను, వెల్లుల్లి: రెండు రెబ్బలు, జీలకర్ర: టీ స్పూను, గసగసాలు : టీస్పూను, ధనియాలు : టీస్పూను.

తయారు చేసేవిధానం :

పుట్టగొడుగుల్ని కడిగి ముక్కలుగా కోయాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి సన్నగా పొడవుగా తరగాలి. మసాలా ముద్ద కోసం తీసుకున్న దినుసులన్నీ ముద్దలా రుబ్బుకోవాలి. బాణలిలో నూనె వేసి ఉల్లిముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. తరువాత కారం, పుట్టగొడుగుల ముక్కలు, పసుపు, ఉప్పు వేసి ఐదు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు కప్పు నీళ్లు పోసి మధ్యస్తంగా వున్న మంటమీద రెండు నిమిషాలు ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తరువాత మసాలా ముద్ద వేసి మరో ఐదు నిమిషాలు ఉడికించి దించి కొత్తిమీర చల్లితే సరి.

పుట్టగొడుగుల వేపుడు

కావలసిన పదార్థాలు : (చిప్స్‌లా తరగిన) బటన్ మష్రూమ్స్: రెండు కప్పులు, క్యాప్సికం తరుగు : పావు కప్పు, ఎండు మిర్చి : 4, ఉల్లి తరుగు: పావు కప్పు, సోంపు: పావు టీ స్పూను, జీలకర్ర : అర టీ స్పూను, దాల్చిన చెక్క : అంగుళం ముక్క, మెంతులు : పావు టీ స్పూను, కారం : ముప్పావు టీ స్పూను, ఉప్పు : రుచికి తగినంత, నూనె: ఒకటిన్నర టేబుల్ స్పూను.

తయారు చేసే విధానం : అర టేబుల్ స్పూను నూనెలో మష్రూమ్ తరుగు వేసి, కొద్దిగా ఉప్పు చల్లి పెద్ద మంటపై తేమ పోయేవరకు వేయించి పక్కనుంచాలి. అదే కడాయిలో నూనె వేసి దాల్చిన చెక్క, సోంపు జీలకర్ర, మెంతులు దోరగా వేయించి మంట తగ్గించి కారం కలపాలి. ఇప్పుడు ఉల్లి, క్యాప్సికం తరుగు, కరివేపాకు, మష్రూమ్స్ వేసి (బాగా అంటుకునేలా) కలిపి దించేయాలి. ఈ చిప్స్ అన్నంతో నంజుకుంటే రుచిగా ఉంటాయి.

మష్రూమ్ బిర్యానీ

కావలసినవి :

పుట్టగొడుగులు : అర కిలో, ఉల్లిపాయలు : రెండు, టొమాటో : ఒకటి, బాస్మతి బియ్యం : 2 కప్పులు, నూనె లేదా నెయ్యి : అర కప్పు, సోయాసిస్ : 2 స్పూన్లు, అల్లం తురుము : ఒకటిన్నర టీ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు : 4, పచ్చిమిర్చి : 2, దాల్చిన చెక్కచ : అంగుళంన్నర ముక్క, యాలకులు : రెండు, లవంగాలు : రెండు, ధనియాల పొడి : ఒకటిన్నర టీ స్పూను, పుదీనా ఆకులు: కొద్దిగా, ఉప్పు : సరిపడా, నిమ్మకాయ : సగం ముక్క.

తయారు చేసే విధానం : బియ్యం కడిగి గంటసేపు నాననివ్వాలి. తరువాత నీళ్లు వంపేసి వుంచాలి. ప్రెషర్ పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి కడిగిన బియ్యం వేసి వేయించి తీసేయాలి. పుట్టగొడుగుల్ని ముక్క లుగా కోసి పక్కన ఉంచాలి. యాలకులు, లవంగాలు, అల్లంతురుము, దాల్చిన చెక్క, వెల్లుల్లి రెబ్బలు అన్నీ కలిపి మెత్తగా రుబ్బాలి. ప్రెషర్‌పాన్‌లో సరిపడా నూనె లేదా నెయ్యి వేసి మసాలా ముద్ద వేసి వేయించాలి. తరువాత ఉల్లిముక్కలు కూడా వేసి వేయించాలి. ఇప్పుడు పుట్టగొడుగుల ముక్కలు, టొమాటో ముక్కలు కూడా వేసి పది నిముషాలు వేయించాలి. తరువాత సోయాసిస్ వేసి కలపాలి. ఇప్పుడు మూడున్నర కప్పుల నీళ్లు పోసి, మరిగిన తరువాత వేయించిన బియ్యం వేసి కలపాలి. ధనియాలపొడి, ఉప్పు, పొదినా వేసి కలిపి మూతపెట్టి తక్కువ మంటమీద పదిహేను నిమిషాలు ఉడికించి దించాలి. ఇష్టమైతే తినేముందు కాస్త నిమ్మరసం పిండుకోవచ్చు.

పుట్టగొడుగుల పకోడి

కావలసిన పదార్థాలు : పుట్టగొడుగులు : పావుకిలో, శనగపిండి : పావుకిలో, పచ్చిమిర్చి : పది, పెద్ద ఉల్లిపాయలు : ఆరు, కొత్తిమీర : రెండు కట్టలు, ఉప్పు : తగినంత, సోడా: తగినంత, ఆయిల్: తగినంత.

తయారుచేసే విధానం : మొదట పుట్టగొడుగులను శుభ్రం చేసి సన్నని ముక్కలుగా చేసుకోవాలి. ఉల్లి, మిర్చి రెండింటిని సన్న చీలికలుగా కొత్తిమీర తురుంలాగా కోసి వుంచాలి. శనగపిండి శుభ్రంగా జల్లెడలో జల్లించాలి. ఆ శనగపిండిలో ఉల్లి, మిర్చి, పుట్టగొడుగు ముక్కలను, కొత్తిమీర తురుమును వేయాలి. తగినంత సోడా ఉప్పు నీళ్లలో కలిపి ఆ నీళ్లను శనగపిండిలో పోసి బాగా కలపాలి. 5 నుంచి 8 నిమిషాల పాటు అలా నానబెట్టిన తరువాత నూనె కాయాలి. ఆ నూనెలో ఈ పిండిని పకోడీల్లో మెదిపేసి గోధుమరంగుకు తిరిగే వరకు వేయించి తీసుకోవాలి. టీ టైంలో టిఫిన్‌గా బాగుంటాయి.

'కుటుంబం అంతా ఒకే రంగంలో వుండడం అరుదు' అనుకుంటుంటాం. అయితే అందుకు సినిమా, రాజకీయ రంగాలు మినహాయింపని మర్చిపోతుంటాం. ఎప్పటి నుంచో చిత్రసీమలో వున్నవారు కూడా 'కుటుంబ పాలన రోజులు పోయాయి' అంటుంటారు. నిశితంగా పరిశీలిస్తే ప్రస్తుతం ఒక్క బాలీవుడ్‌లోనే ఇరవైకి పైగా కుటుంబాలు నటనారంగంలోనే వున్నాయి. ఆ విశేషాలేంటో చూద్దాం.

బాలీవుడ్ నట కుటుంబాలు

కుటుంబంలోని అత్యధికులు చిత్రసీమలో వున్న వారి గురించే చెప్పుకుందాం. అలా కాకుండా పెద్దమ్మ, పిన్నమ్మ పిల్లలు.. పెద్దనాయన చిన్న నాయన పిల్లలు... మేనకోడళ్లు మేనల్లుళ్ల దాకా వెళితే...చాలా చెప్పుకోవాల్సి వస్తుంది. అలా చూస్తే బాలీవుడ్‌లో 60 శాతం నటులు ఏదోక విధంగా బంధుత్వం వున్న వాళ్లే. పృథ్వీరాజ్ కపూర్ నాటి నుంచే నట వారసత్వం కొనసాగుతోంది. తెరమీద కనిపిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన వారి వివరాలు ఆసక్తికరంగా వుంటాయి.

'బిగ్' ఫేమిలీ

మొదట అమితాబ్ బచన్ నుంచే చెప్పుకుందాం. అభిమానంతో 'బిగ్ బి' అని పిల్చుకునే డెబ్బై రెండేళ్ల అమితాబ్ బచన్, ఎంపి, నటి అయిన ఆయన భార్య జయా బచన్, కొడుకు అభిషేక్ బచన్, కోడలు ఐశ్వర్యా రాయ్ ... వెండితెర వేల్పులుగా వున్నారు. 'భోజనాల సమయంలో సినిమాల గురించి పెద్దగా మాట్లాడుకోం' అని అభిషేక్ బచన్ చెప్పినప్పటికీ ... తన కుమారుడు, భార్య పక్క పక్క సినిమా సెట్ల మీద కనిపించడం గొప్పగా వుంటుందంటాడు అమితాబ్.

సల్లూ సోదరులు

సల్మాన్ ఖాన్ బాలీవుడ్‌ను ఏలుతుండగా... ఆయన సోదరులు అర్బాజ్, సోహైల్ ఖాన్ చిత్ర నిర్మాణ పనులు చూస్తుంటారు. అప్పుడప్పుడు నటిస్తుంటారు సరదాగా.

కపూర్లు

రిషి కపూర్ తన భార్య నీతు, కుమారుడు రణబీర్‌తో కలిసి ఓ చిత్రంలో నటించాడు. వారితో కలిసి తెర మీద కనిపించాలన్న ఒకే ఒక్క కోరికతో 'బేశరమ్' చిత్రాన్ని అంగీకరించానంటాడు రిషి. అయితే అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేక పోయిందనుకోండి.

అనిల్ కపూర్ నేటికీ సినిమాల్లో కనిపిస్తూనే వున్నాడు. ప్రియాంక చోప్రా, రణవీర్ సింగ్‌కు తండ్రిగా 'దిల్ ధడక్‌నే దో' చిత్రంలో చేశాడు. ఇదికాక 'వెలకమ్ బ్యాక్'లో మంచి పాత్ర దక్కించుకున్నాడు. కూతురు సోనమ్ నటిగా రాణిస్తుండగా...కొడుకు హర్షవర్ధన్ 'మీర్జియా' ద్వారా తెరంగేట్రం చేయనున్నాడు.

తండ్రీ కొడుకులు

అనిల్ కపూర్ సమకాలీనుడైన జాకీష్రాఫ్ కుమారుడు టైగర్ సినిమాలు చేస్తున్నాడు. మధ్యలో కొంత విరామం తీసుకున్నప్పటికీ ... జాకీ ప్రస్తుతం తనకు నప్పే పాత్రలను ఎంచుకుంటున్నాడు.

సన్నీడియోల్ తన పెద్ద కుమారుడు కరణ్ కోసం మంచి ప్రాజక్టు ఎంపిక చేసే పనిలో వున్నాడు. కాగా... ఈ మధ్య తండ్రి ధర్మేంద్ర, సోదరుడు బాబీతో కలిసి 'యమ్లా పాగ్లా దీవానా' చేసి అభిమానుల ఆదరణ పొందిన సంగతి తెలిసిందే.

వినోద్ ఖన్నా రాజకీయాల్లో తీరిక లేకుండా వున్నాడు. అయినప్పటికీ బాలీవుడ్‌లో

సల్మాన్‌ఖాన్ వంటి సూపర్‌స్టార్లకు తండ్రిగా మాంచి డిమాండ్ వున్న నటుడు. ఖన్నా కుమారులైన అక్షయ్, రాహుల్ సైతం అతి త్వరలో తెరపై దర్శనమివ్వనున్నారు. పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారని వినికిడి.

వివేక్ ఒబెరాయ్ కామెడీ నుంచి విలనీ వరకు చేసేస్తుండగా... వివేక్ తండ్రి సురేష్ ఒబెరాయ్ మాత్రం ఎంపిక చేసుకున్న పాత్రలనే చేస్తున్నాడు.

తండ్రీకూతుళ్లు

గోవిందా కుమార్తె నర్మద సినిమాల కోసం తన పేరును టీనా అహుజాగా మార్చుకుంది. తొలి చిత్రం హడావిడిలో వుంది.

సునీల్ షెట్టి కూతురు అథియ. సునీల్ విభిన్నమైన పాత్రలు చేస్తుండగా అథియ 2015లో రానున్న తన మొదటి చిత్రం 'హీరో' పనుల్లో బిజీగా వుంది.

అథియ సహ నటుడు సూరజ్ పాంచోళి కూడా నట కుటుంబం నుంచే వచ్చాడు. సూరజ్ తండ్రి ఆదిత్య పాంచోళి తల్లి జరీనా కూడా తారలే.

నటుడు, రాజకీయ నాయకుడు అయిన శత్రుఘ్నసిన్హా కూతురు సోనాక్షి సిన్హాకలిసి ఒకే చిత్రంలో ఇంతవరకు నటించకపోయినప్పటికి త్వరలో అభిమానుల కోరిక తీర్చవచ్చు.

పటోడీ వంశాంకురం సైఫ్ అలీఖాన్. బాలీవుడ్‌లో వారసత్వంగా నటిస్తున్న కుటుంబీకుల్లో సైఫ్ పేరు తప్పక ప్రస్తావించుకోవాలి. సైఫ్ భార్య కరీనా కపూర్ బాలీవుడ్‌లో ఎంత బిజీ నటో తెల్సిందే. ఇక అతని మాజీ భార్య అమృతాసింగ్ తెరపై తల్లి పాత్రలు చేసేస్తోంది. సైఫ్ తల్లి షర్మిలా టాగోర్, సోదరి సోహా అలీ ఖాన్ కూడా తారలే.

కరీనా తండ్రి రణధీర్ కపూర్ నేటికీ 'సూపర్ నాని' వంటి చిత్రాలతో బిజీ. బెబో సోదరి కరిష్మా బాలీవుడ్‌లో పునరాగమనానికి కావాల్సిన ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది.

పంకజ్ కపూర్, షాహిద్ కపూర్ తండ్రీకొడుకులు. షాహిద్ సవతి తల్లి సుప్రియ పథక్ వెండితెర తల్లిగా వెలిగిపోతోంది. సుప్రియ సోదరి రత్న పథక్ షా సైతం అమ్మగా చేస్తోంది. ఆమె భర్త నసీరుద్దీన్ షా ఎంత మంచి నటుడో అందరికీ తెలిసిన విషయమే. ఈమె కుమారులు సైతం ఇవాళో రేపో తెరపై కనిపించనున్నారు.

సినిమాల్లో బిజీగా వున్న తండ్రీకూతుళ్లుగా కమల్ హాసన్, శృతి హాసన్ పేర్లు చెప్పుకోవచ్చు. ఇప్పుడు వీరి సరసన అక్షర హసన్ కూడా వచ్చి చేరనుంది.

భార్యాభర్తలు



తండ్రీకూతుళ్లు, సోదరీసోదరుల తర్వాత బాలీవుడ్‌లో నటనారంగంలో వున్న భారాభర్తల గురించి చెప్పుకోవాలి. సూపర్‌స్టార్లయిన అజయ్ దేవగన్, కాజోల్ కలిసి ఒకే చిత్రంలో నటించడానికి పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. అజయ్ కుర్ర హీరోయిన్లతో నటిస్తుండగా... సమకాలీన హీరోలు, కొత్త హీరలోలు సైతం తమ చిత్రాల్లో కాజోల్ వుండాలని కోరుకుంటున్నారు.

రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా కూడా నటులే. రితేష్ హిందీ చిత్రాలతో పాటు మరాఠీ సినిమాలు కూడా చేసేస్తుండగా...అతని భార్య ఈ మధ్యే బ్రేక్ తీసుకుంది (తల్లి కాబోతున్న సందర్భంగా).

ఇలా చెప్పుకుంటూ పోతే బాలీవుడ్‌లో ఎన్ని జంటలో! ఎన్ని కుటుంబాలో!! ◆

నవ్వుల్ – పువ్వుల్

యంగ్

సుబ్బారావు: నీకెప్పుడు ఫోన్ చేసినా యంగ్ ఏజ్ వస్తుందేమిట్రా..?

అప్పారావు : ఎంగ్ ఏజ్ కాకపోతే ఓల్డ్ ఏజ్ వస్తాదేమిటి. నేనింకా యంగే...!

అనుకున్నదేమీ..!



అచ్యుతం : నేననుకున్నదేమిటీ సరిగ్గా జరగడం లేదురా...!

రాజారావు : ఏమనుకున్నావేమిటీ..?

అచ్యుతం : నేనేమనుకున్నా తిరిగి నన్ను ఎవరూ ప్రశ్నించకూడదని... నీవు ప్రశ్నించావుగా...!

నీవేమవుతావ్

టీచర్ : చరణ్ బాగా చదువుతున్నాడు. వీడు ఖచ్చితంగా పెద్ద ఇంజనీర్ అవుతాడు!

కిరణ్ : మరి నేను టీచర్...?

టీచర్ : నీవస్సలు బాగా చదవడం లేదు, నీవేమవుతావో నీవే చెప్పు చూద్దాం...?

కిరణ్ : 'బిల్డర్‌ని'.



నో లైసెన్స్

పోలీస్ : అంత వేగంగా బండి నడుపుతున్నావేమయ్యా..?

ధర్మేంద్ర : నాకు లైసెన్సు లేదు సార్... మీకు దొరకకుండా తొందరగా ఇంటికి వెళదామని..!

అన్నప్పుడల్లా

సుబ్బారావు : నీ బండికి బ్రేకుల్లేవా.. అయితే నన్నేం చేయమంటావు...?

వెంకట్రావు : నేను బ్రేక్ అన్నప్పుడల్లా... నీవు బండి దిగి, పట్టుకుని బండినాపాలి...!



పేరేంటమ్మా?

తల్లి : నువ్వు పెళ్లి చేసుకోవాలనుకుంటున్న అబ్బాయి పేరేంటమ్మా...?

కూతురు : ఇంకా తెలియదమ్మా... ప్రస్తుతం నెట్‌లో ఛాటింగ్ మొదలు పెట్టా అంతే.. పేరు దాకా రాలేదు...!

గిన్నిస్‌బుక్

తండ్రి : మరీ ఇన్నిసార్లు పరీక్ష తప్పుతున్నావేంరా...?

కొడుకు : ఎక్కువసార్లు పరీక్ష తప్పి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కుదామని నాన్నా..!

టేస్టీ టిఫిన్

శకుంతల : మీరు పెట్టిన టిఫిన్ చాలా బావుందండీ..ఎలా చేశారు?

శాంత : నిన్న మా ఇంట్లో ఫంక్షన్ జరిగింది. మిగిలిన పదార్థాలన్నీ కలిపేసి ఇలా చేశానంతే...!



పిచ్చోడు

చరణ్ : వాడు పిచ్చోడురా...!

గోపి : ఏం అలా ఎందుకంటున్నావు...?

చరణ్ : నిన్నంటే నీవు ఊరుకోవుగా... అందుకే వాడినంటున్నాను...!

ఎవరికో ఎందుకు

చింటూ : నాన్నా నాకు విజిల్ కొనవా...?

తండ్రి : కొంటాగానీ, ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా ఆడుకోవాలి...!

చింటూ : అలాగే నాన్నా, ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా నీ చెవిలో మాత్రమే ఊదుతా...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

రెండు ప్రపంచాల దుబాయ్

దుబాయ్ మనకు చిరపరిచితమైన పేరు. మనదేశం నుంచి సాధారణ కార్మికుల నుంచి వృత్తి నిపుణుల వరకూ ఉపాధికోసం తరలి వెళ్లే నగరం. దుబాయ్ పేరు వినగానే అంతర్జాతీయ వాణిజ్యం గుర్తుకొస్తుంది. ఇటీవల ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజరు ఎస్.సుధాకర్, ఆయన శ్రీమతి మణి దుబాయ్ నగరాన్ని సందర్శించారు. వారి పర్యటన విశేషాలు ఈవారం తెలుసుకుందాం.

ధనిక దేశాల్లో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ఏడు ప్రాంతాల కలయిక. అవి : అబుదభి, దుబాయ్, షార్జా, అజ్మన్, క్వయన్, రస్ఆల్‌కైమా, పూటురియా. అబుదభి వీటికి రాజధాని. ఆర్థిక రాజధానిగా పేరొందిన నగరం దుబాయ్. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న నగరాల్లో దుబాయ్ ఒకటి. ఎటుచూసినా పెద్దపెద్ద క్రౌన్స్, ఆకాశాన్నంటే బహుళ అంతస్థుల భవనాలు, కళ్లు చెదిరిపోయే షాపింగ్‌మాల్స్, విలాసవంతమైన హోటళ్లూ కనిపిస్తాయి. విశాలమైన రోడ్లు ఆశ్చర్యం గొలుపుతాయి.

దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక పెద్ద ఆకర్షణ. ప్రపంచ నగరాల్లో ఇటు తూర్పుకు, అటు పశ్చిమను కలిపే జంక్షన్ లాంటిది. నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రపంచంలో విశాలమైన విమానాశ్రయాల్లో ఇదొకటి. ఈ ఎయిర్‌పోర్టులో సుమారు 40 వేల రకాల వస్తువులు దిగుమతి సుంకం లేకుండా కొనుక్కోవచ్చు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకే లభిస్తాయి. ఇక్కడ రోజుకు 15 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరుగుతుంది. 62 టెర్మినల్స్ (విమానాలు ఆగేందుకు, వెళ్లేందుకు స్టాండ్స్) ఆగేందుకు, 62 టెర్మినల్స్ వెళ్లేందుకు ఉన్నాయి.

తూర్పు పశ్చిమల కూడలి!

దుబాయ్ అభివృద్ధికి కారణం భౌగోళికంగా దానికున్న ప్రత్యేకతే! ఇది ఇటు ఆసియా దేశాలకు, అటు ఐరోపా, అమెరికా దేశాలకు జంక్షన్ వంటిది. అలా జంక్షన్‌గా ఉండటమే దుబాయ్‌కి పెద్ద ఆదాయ వనరు. ఇక్కడ సాగే వాణిజ్యంలో 70 శాతం ఎగుమతి, దిగుమతులపైనే ఆధారపడి ఉంటుంది. సరుకులు ఒక దేశం నుంచి రావడం, మరో దేశానికి తరలించడం ఇక్కడ పెద్ద లావాదేవీ. పన్ను 4 శాతానికి మించి ఉండదు. రెండో ఆదాయవనరు ఇంధన వాణిజ్యం. ఆర్థికంగా బలపడిన దుబాయ్ అంతర్జాతీయంగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. మన దేశ పెట్టుబడిదారులు అనేకమంది అక్కడ పెట్టుబడి పెట్టారు.

బుర్జు ఖలీఫా

దుబాయ్‌లో టూరిజం, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రధానమైన పరిశ్రమలతో బాటు అనేక చిన్న చిన్న తయారీ పరిశ్రమలు, ఆధునిక సాంకేతిక ఐటి పరిశ్రమలు ఉన్నాయి. 20 లక్షల జనాభా గల దుబాయ్ నగరానికి లక్షలాదిమంది పర్యాటకులు వస్తుంటారు. హోటల్స్, క్లబ్స్, పబ్స్ నిత్యం కళకళలాడుతుంటాయి. ఇక్కడ అక్షరాస్యత 80 శాతం. అత్యధిక ప్రజలు ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తారు. ఇందులో 80 శాతం మంది సున్నీలైతే- 16 శాతమంది షాలు. ఇతరులు 4 శాతం. 15 - 64 ఏళ్ల వయస్కులు జనాభాలో 75 మంది ... అంటే 15 లక్షల మంది ఉన్నారు. ఈ నగరంలో కరెన్సీ ధీరమ్. ప్రస్తుతం 17 రూపాయల విలువ ఉంటుంది. వాణిజ్యమంతా ధీరమ్స్‌లో జరుగుతుంది. అమెరికా డాలర్లను కూడా పెద్దపెద్ద మాల్స్‌లో అంగీకరిస్తారు.

అనేక పనుల్లో ...

పెట్టుబడి పెత్తనం చేసే ఏ దేశంలోనైనా శ్రమజీవులు చెమట ఊడ్చాల్సిందే! దుబాయ్ అందుకు భిన్నమైన ప్రదేశం కాదు. పైగా జీవన ప్రమాణ వ్యత్యాసాలూ తీవ్రంగానే ఉన్నాయి. ఇక్కడ ధనికులకు విలాసవంతమైన జీవితం ఉంది. సామాన్యులకు రోజువారీ బతుక్కి కూడా వెంపర్లాడాల్సిన పరిస్థితి ఉంది. ఇవి రెండూ రెండు ప్రపంచాలు. ఎక్కువగా భారత ఉపఖండం నుంచి వలస వచ్చేవారే ఇక్కడ కార్మికులు. ఒక్కో దేశం నుంచి ఒక్కో తరహా కార్మికులు ఇక్కడ అత్యధికంగా ఉన్నారు. నిర్మాణరంగంలో పనిచేసేవారు చైనా, ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలవారు ఎక్కువగా ఉన్నారు. రెస్టారెంటు, షాపింగ్‌మాల్స్‌లో పనిచేసేవారు అత్యధికులు ఫిలిప్పీన్స్. ఇంగ్లీషు తెలిసి ఉండడం వారికి ఒక ఈ తరహా ఉపాధిని ఇస్తుంది. ట్యాక్సీ డ్రైవర్లుగా ఎక్కువగా పాకిస్తానువారు ఉన్నారు. సెక్యూరిటీ విభాగాల్లో ఆఫ్రికా దేశస్థులు ఎక్కువగా కనిపించారు. ఇంటిసేవల్లో ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారు ఉపాధి పొందుతున్నారు.

భారతదేశం నుంచి వచ్చిన ఉద్యోగులు, కార్మికుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఐటి పరిశ్రమలో నిపుణులుగా, డాక్టర్స్, టీచర్స్, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత ఉద్యోగాలతో బాటు, పరిశ్రమ కార్మికులు, ఆఫీసు బాయ్స్, ఇంటి పనివారు, మున్సిపల్ పనివారు, కాంట్రాక్టు కార్మికులు భారతీయులు పనిచేస్తున్నారు. కార్మికులు, ఇతర కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం నెలకు సుమారు 1000-1200 ధీరమ్స్ (మన రూపాయల్లో 17 వేల నుంచి 20 వేల 400) ఇస్తారు. ఉన్నత ఉద్యోగాలకు వేతనాలు బాగానే ఉంటాయి. భార్యాభర్తలు ఇద్దరూ కాంట్రాక్ట్ ద్వారా వలస వచ్చి పనిచేస్తుంటే ఇద్దరికీ కలిపి సుమారు 4 వేల ధీరమ్స్ వేతనంగా లభించే అవకాశం ఉంది.

నగరానికి దూరంగా కార్మిక కాలనీలు

దుబాయ్ నగరానికి దూరంగా సాధారణ కార్మికుల కాలనీలు ఉంటాయి. అన్నీ అపార్ట్‌మెంట్స్, స్టూడియో హోమ్స్. కామన్ కిచెన్, కామన్ బాత్‌రూమ్స్ ఉంటాయి. ఒక చిన్న అపార్ట్‌మెంట్‌కు 800 ధీరమ్స్ అద్దె చెల్లించాలి. నలుగురు, ఐదుగురు కలసి ఉంటారు. ఇంటి అద్దె కంపెనీ గాని భరిస్తే సుమారు 400 నుంచి 500 ధీరమ్స్‌తో జీవితం సాదాగా సాగుతుంది. అక్కడ శుక్ర, శనివారాలు సెలవు దినాలు. భారతీయ కార్మికులు ఎక్కువమంది ఆ రెండ్రోజులూ విశ్రాంతి తీసుకోరు. ఆదాయం కోసం ఓవర్‌టైమ్ పనిచేస్తారు. గురువారం సాయంత్రం ఆ కాలనీలకు దగ్గర్లోనే సంతలు జరుగుతాయి. అన్ని వస్తువులూ, నిత్యావసరాలూ దొరుకుతాయి. ఆ సాయంత్రపు వేళల్లో ఒకే దేశం లేదా ప్రాంతం నుంచి వెళ్లిన కార్మికులు కలుసుకుంటారు. కష్టసుఖాలు మాట్లాడుకుంటారు.

దుబాయ్‌లో వాతావరణం చాలా పొడిగా, వేడిగా ఉంటుంది. నివాసాల్లో ఎసి తప్పనిసరి. ఎండవేళల్లో బయట తిరగలేరు. తిరిగేందుకు ఎసి బస్‌లు, మెట్రో ట్రెయిన్స్ ఉంటాయి. అయితే, ఇవి అన్ని ప్రదేశాలకు వెళ్లవు. కాబట్టి అత్యధిక మంది ఉద్యోగులు కారుపైనే ఆధారపడతారు. కార్మికులకు కాంట్రాక్టరు కల్పించే రవాణా సదుపాయమే ఆధారం. పనిప్రదేశం దగ్గర్లో ఉన్న కార్మికులు, ఇతర తక్కువ వేతన జీవులు సైకిళ్లు వాడతారు.

విద్య వైద్యం ఉచితం

అరబ్స్‌కు (వారి పేరుతో మాత్రమే) ఉచిత విద్య, వైద్యం అందుతాయి. వలస కార్మికులకు కంపెనీ/ కాంట్రాక్టరు పెట్టగలిగితే

ఆ రెండో ప్రపంచం

◆ చూద్దామా

బహుళ అంతస్తు భవనాలు

ఫరవాలేదు. లేకపోతే పిల్లల్ని చదివించుకోవడం చాలా ఖరీదైన పని. వైద్యం పొందటం కూడా కష్టమే! ఇలాంటి కారణాలవల్లే కార్మికులు ఒంటరిగానే దుబాయ్‌కి వలస వెళతారు.

చట్టం గట్టిగా పనిచేస్తుంది

దుబయ్‌లో పౌరసూత్రాలు చాలా కఠినంగా అమలు చేస్తారు. ఎంతటివారైనా చట్టం ముందు సమానమే! మహిళల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దుబాయ్ ఒకప్పుడు ఫ్రెంచి పాలనలో ఉండేది. కాబట్టి ఆ తరహా చట్టాలు ఇక్కడ అనుసరిస్తారు. ఆల్‌మక్తుం రాజుల వారసులు ఆల్‌బుఫాల్షాయ్ నేటికీ పాలకులు. వారు ఆమోదించిన చట్టాలు కచ్చితంగా అమలు చేస్తారు. మాదకద్రవ్యాల తయారీ, తరలింపు; చెక్కు బౌన్సు వంటివి తీవ్రమైన నేరాలు. దురుసు ప్రవర్తన, కాలిమీద కాలేసుకొని కూచోవడం, ఎవరినైనా వేలెత్తి చూపడం, పిలవడం; అనుమతి లేని చోట ఫొటోలు వంటివి నేరాలుగా పరిగణిస్తారు. నేరపరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు.

ప్రసిద్ధ పోర్టుల నిలయం

దుబాయ్ రెండు ప్రతిష్టాత్మక పోర్టుల నిలయం. రషీద్ పోర్టు ప్రకృతి సహజసిద్ధమైనది. ఇక్కడ సరాసరి గంటకు 1000 టన్నుల సరుకులు దిగుమతి చేస్తారు. మానవ నిర్మితమైన జెబెల్ ఆలీ పోర్టు అత్యంత పెద్దది. ఇది 67 బెర్తులతో 15 కి.మీ. పొడవు ఉంటుంది. ప్రపంచంలోని అతి పెద్ద 10 పోర్టుల్లో ఇదొకటి.

దుబాయ్ సందర్శలను విశేషంగా ఆకర్షించే నిర్మాణం బుర్జుఖలీఫా టవరు. దీని ఎత్తు 820 మీటర్లు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన భవనం ఇది. దీని నిర్మాణం 2004లో ప్రారంభించి 2010లో పూర్తి చేశారు. దీనిని చూడటానికి వేలాదిమంది పర్యాటకులు ప్రతిరోజూ వస్తుంటారు.

రెండు ప్రపంచాలు

ఆధునిక ఆర్థిక నగరంమైన దుబాయ్‌లో రెండు ప్రపంచాలున్నాయి. ధనికులు, మాల్స్, హోటల్స్ విలాసవంతమైన జీవితం ఒకవైపు. తక్కువ జీతాలతో కాలం వెళ్లబుచ్చుతున్న వలస కార్మికులు జీవితం మరోవైపు. ఎక్కడా శాశ్వత కార్మికులు ఉండరు. అంతా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులే! ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతో బాటు, ఉపాధిని కూడా కల్పిస్తున్న దుబాయ్ అనేక లక్షల వలస కార్మికులు, ఉద్యోగులకు ఆసరా ఇస్తోంది. ఎన్‌ఆర్‌ఐలుగా మనవాళ్లు అత్యంత హెచ్చు మొత్తాలను విదేశీ ద్రవ్యాన్ని ఇక్కడినుంచి ఆర్జిస్తున్నారు. వృత్తినిపుణులతో పాటు సాదాసీదా కార్మికులకు కూడా దుబాయ్‌లో ఉపాధి దొరుకుతుంది. అందుకే దుబాయ్ అంటే భారతీయులకు అంత ఆసక్తి! ఈ మోజు ఉండడంవల్లే దుబాయ్ పేరిట అనేక మోసాలు జరుగుతున్నాయి. మధ్యవర్తులు, కంపెనీలు మోసగించడంతో వేలాదిమంది కార్మికులు దుబాయ్‌లో నిబంధనలకు విరుద్ధంగా జీవిస్తున్నారు. అనేక సదుపాయాలూ, సౌకర్యాలూ ధనికులకు పుష్కలంగా సమకూర్చే అద్భుత అధునాతన నగరం దుబాయ్! చెమటోడ్చి పని చేసే సాధారణ శ్రామికుల ఇరుకిరుకు నివాసాలూ, అరకొర ఆదాయాలతో అలరారే నగరం కూడా దుబాయే! మొదటి ప్రపంచం దుబాయ్ ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రెండోది ఆ వెలుగుల వెనక అస్పష్టంగా గోచరిస్తుంది.

- ఎస్.సుధాకర్, విశాఖపట్నం
ఫోన్: 94900 99122

హాబీల హాయ్ హాయ్

హాబీలు! అంటే తీరిక వేళల్లో సంతోషం కోసం పెట్టుకున్న వ్యాపకాలు. మనోద్దీపకాలు. ఉల్లాస కారకాలు. ఇంగ్లీషులో హాయిగా హాబీ అనే పదాన్ని తెలుగులో వ్యాపకం అనొచ్చు. అయితే అది అవసరం కోసం గాక ఆనందం కోసం మొదలవుతుంది. అలవాటుగా స్థిరపడుతుంది. ఉపశమనం కోసం ఉల్లాసం కోసం చేసే పనులే హాబీలు. ఈ వారం అట్టమీది కథలో హాబీల గురించిన పలు ఆసక్తికర అంశాలు ...

- ఆదిత్య

మహాభారతంలో అత్యంత రసవత్తర ఘట్టం విరాటపర్వం. మహావీరులైన పాండవులు తమ కన్నా చాలా చిన్నరాజు విరాటుని కొలువులో రకరకాల పనులు చేస్తారు. ధర్మరాజు జూదం, భీముడు వంట, అర్జునుడు నాట్యం ఇలా.. అందరూ అన్నదమ్ములైనా ఇలా వేర్వేరు పనులు ఎందుకు పెట్టుకున్నారు? ఇన్ని పనులు వారికి ఎలా వచ్చు?

మనమంతా ఎందుకు ప్రాణాలతో వున్నాం? ప్రాణ వాయువు పీలుస్తున్నందుకు.. చివరి శ్వాస అంటారందుకే.. అయితే ఆ పరమ సత్యం మనకు చాలా కాలం వరకూ తెలియదు. ఇప్పుడంటే చదవుకున్న చాలామంది ఆక్సిజన్ ఒ2 అని చెప్పేస్తారు కాని అసలు గాలిలో ప్రాణ వాయువు అంటూ ఒకదాన్ని విడదీసే అవకాశముందని కూడా తెలియదు. ఆ సంగతి కనుగొన్నవాడు ఆంటన్ లివోయిషర్. రసాయన శాస్త్రంలో అనేక గొప్ప గొప్ప ఆవిష్కరణలతో ముడిపడివున్న ఆయన అసలేం చేసేవారో తెలుసా? పాలనా నిర్వహణ. 1743లో పుట్టిన లావోయిషర్ ఫ్రెంచి రాజ వంశస్తుడు. అనేక పరిపాలనా బాధ్యతలు చూసేవాడు. అయితే ఆయనకు బాగా ఆనందం ఇచ్చే అలవాటు ఏమిటంటే రసాయన పదార్థాల పరిశీలన. ప్రతిరోజూ ఉదయం టిఫిన్ చేసేముందు రాత్రి భోజనం తర్వాత రసాయనాలతో ఏవో పరిశోధనలు, ప్రయోగాలు చేస్తుండేవాడు.ఆ క్రమంలోనే ఆయన ఆక్సిజన్ గురించి తెలుసుకున్నాడు.

పోనీ– జార్జి బుష్ తెలుసా? అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి బుష్ చిత్రాలు గీస్తాడని విన్నారా? భారత రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన మాజీ ప్రధాని వి.పి.సింగ్ అనారోగ్యానికి గురైన తర్వాత చిత్రాలు గీసి ఎగ్జిబిషన్ నిర్వహించడం ఎలా జరిగిందో చెప్పగలరా? ఇప్పటి అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ నటించిన చిత్రాలు సరే గీసిన చిత్రాల గురించి తెలుసుకుంటారా?

అల్లు రామలింగయ్య అనగానే గొప్ప హాస్యనటుడు మన ముందు సాక్షాత్కరిస్తాడు. కాని ఆయన హోమియో వైద్యంతో ఎంతోమందికి ఉపశమనం కలిగించిన సంగతి మీ దృష్టికి వచ్చిందా?

హైదరాబాద్ వచ్చే వారంతా తప్పక చూసే ప్రదేశాల్లో ఒకటి సాలార్జంగ్ మ్యూజియం..అక్కడ వున్న చిత్ర విచిత్ర వస్తు సముదాయం తరాల తరబడి కొన్ని కోట్లమందికి సంతోషం కలిగిస్తున్నది. ఇదంతా ఎలా మొదలైందంటే సాలార్జంగ్‌కు అరుదైన వస్తువులు సేకరించే అలవాటు వుంది గనక!

పరస్పర సంబంధం లేనివిగా కనిపించే ఈ పేర్లు వారి పనులు అన్నిటినీ అర్థం చేసుకోవాలంటే మీరు 'హాయ్ హాబీ...' అనాల్సిందే మరి. ఎందుకంటే ఇప్పుడు చెప్పినవన్నీ వారి వారి హాబీలు! అంటే తీరిక వేళల్లో సంతోషం కోసం వారు పెట్టుకున్న వ్యాపకాలు. మనోద్దీపకాలు. ఉల్లాస కారకాలు. ఇంగ్లీషులో హాయగా హాబీ అనే పదాన్ని తెలుగులో వ్యాపకం అనొచ్చు. అయితే అది అవసరం కోసం గాక ఆనందం కోసం మొదలవుతుంది. అలవాటుగా స్థిరపడుతుంది. అలాటి ఆనంద వ్యాపకాలు తర్వాత ప్రధాన వ్యాపకాలుగా మారే సందర్భాలు వుంటాయి. అనుకోని రీతిలో అవి గొప్ప ప్రయోజనం కలిగించే ఘటనలూ వుంటాయి. ఏది ఏమైనా తప్పనిసరిగానో విధి నిర్వహణ కోసమో చేసే పనులు హాబీలు కాలేవు. తమ పనులు తాము చేసే క్రమంలో ఉపశమనం కోసం ఉల్లాసం కోసం చేసే పనులే హాబీలు. అలవాటును ఇంగ్లీషులో హాబిట్ అంటారని మనకు తెలుసు. దాన్ని కాస్త కుదించిన హాబీ అనే పదం 1816లో పుట్టింది. కాలక్షేపం కోసం కొయ్యగుర్రం ఎక్కడం మనకు తెలుసు కదా.. ఆ కొయ్యగుర్రాన్ని 'హాబీ హార్స్' అని పిలిచారు. చివరకు ఆ పదం డిక్షనరీలోకే ఎక్కేసింది. తెలుగులో వ్యాపకం అన్న పదం దగ్గరగా వుంటుంది గాని సరైన అర్థం ఇవ్వదు. ఎందుకంటే కాలం గడపడానికి ఏ పని పెట్టుకున్నా దాన్ని వ్యాపకం అనొచ్చు. కాని అందులో మనోల్లాసం కలిగించే విధంగా ఇష్టపూర్వకంగా స్వీయ అభిరుచితో పెట్టుకున్న



దాన్నే హాబీ అంటారు. మనిషైన ప్రతివారికీ ఏవో ఇష్టాయిష్టాలు వుంటాయి. రుచులూ అభిరుచులూ కూడా వుంటాయి. అవకాశాల్లో మాత్రం హెచ్చుతగ్గులుండొచ్చు. ఏది ఏమైనా ప్రతి ప్రాణీ సంతోషం కోసం తమకు నచ్చిన ఏదో ఒక పని చేస్తుంది. బుద్ధిజీవి అయిన మనిషి కాలక్రమంలో తనకు ఉల్లాసం కలిగించేవేమిటో పసిగట్టి బుద్ధిపూర్వకంగా చేయడం మొదలుపెట్టాడు. ఆ విధంగా హాబీలు మొదలైనాయి.

భారతీయుల హాబీలంటే ఏముంటాయి? అత్యధికులు ఇష్టపడేది సంగీతం.. ఆటలు.. స్టాంపులు నాణేలు పాత వస్తువులు వగైరాల సేకరణ.. తోట పని.. జల విహారం.. వంట చేయడం..ఫోటోలు తీయడం.. చిత్ర లేఖనం.. నటించడం.. చదవడం... నక్షత్రాలు గ్రహాల పరిశీలన.. పందాల్లో పోటీల్లో పాల్గొనడం.. కుక్కలు పిల్లులు వగైరా పెంపుడు జంతువులు.. పిల్లలతో గడపడం.. టీవీ చూడటం.. స్వచ్ఛంద సేవలో పాల్గొనడం.. పార్టీలకు వెళ్లడం.. ఉపన్యాసాలివ్వడం.. ఇంటర్‌నెట్ బ్రౌజింగ్.. అంత్యాక్షరి.. డాన్సింగు.. ఫైళ్లు కాగితాలు పుస్తకాలు సర్దడం... పాత ఉత్తరాలు ఫోటోలు చూసుకోవడం.. పత్రికలకు ఉత్తరాలు రాయడం ఛానళ్లకు ఫోన్ చేయడం.. పజిళ్లు పూరించడం.. కథలు కవిత్వం రాయడం.. సాంకేతిక పరికరాల గురించి తెలుసుకోవడం.. ఇలా చెప్పాలంటే రకరకాల హాబీలు కాలానుగుణంగా వుంటాయి. పాతవి కొన్ని మాయమవుతుంటే కొత్తవి కొన్ని వస్తుంటాయి.

అన్నిట్లోనూ కాస్త ఎక్స్‌ట్రా అనిపించే పాశ్చాత్య దేశాల్లో ఈ విషయం కూడా అతిగానే వుంటుంది. యాభై నుంచి కొన్ని వేల వరకూ హాబీల పేర్లు వారు చెబుతారు. ఒక ఆన్‌లైన్ సంస్థ అయితే 36000 హాబీ ఐటమ్స్ తమ దగ్గర వున్నట్టు ప్రకటించింది. భారతదేశంలో 12 నుంచి 15 వరకూ హాబీలుగా చెబుతున్నారు.

హాబీలను అయిదు రకాలుగా విభజించొచ్చు- సేకరణ, పోటీ, పరిశీలన, సృజన, శ్రమ.. పైన చెప్పుకున్న వాటిలో ఏవి ఏ రకంలోకి వస్తాయో తేలిగ్గానే తెలిసిపోతుంది. అయితే నైపుణ్యానికి స్కూళ్లలో వుండే ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు హాబీలకు తేడా వుంటుంది. ఇప్పుడు బళ్లలో చదువు తప్ప మరో గొడవ లేదు గాని వుందనుకుంటే అవి వ్యక్తిగతమైనవిగా చెప్పలేము. విజ్ఞానాభివృద్ధికి అందరికీ వాటిని నేర్పిస్తారు. కాని ఇక్కడ హాబీ అనేది వ్యక్తిగతమైంది. అదే హాబీ వున్న వారు తర్వాత తటస్థపడొచ్చు గాని నిత్య జీవితంలో ఎవరికి వారే కొనసాగించుకుంటారు. ఇంకా చెప్పాలంటే కేవలం వారొక్కరే దానివల్ల ఆనందం పొందుతుంటారు. ఇక్కడే చాలా మంది పొరబడుతుంటారు.

ఏదైనా రంగంలో నిష్ణాతుడైన వ్యక్తిని వృత్తి నిపుణుడు (ప్రొఫెషనల్) అంటారు. దాన్ని కొత్తగా నేర్చుకుంటున్నవారిని ఔత్సాహికులు (అమెచ్యూర్) అంటారు. వీళ్లలో ఎవరైనా తమ సంతోషం కోసం పెంచుకున్న ఏదైనా ఆసక్తినే హాబీ అంటారు. తన రంగంలో చాలా నిపుణుడైన వ్యక్తి ఈ విషయంలో ఔత్సాహికుడు కావచ్చు. మన కుటుంబ జీవితంలో మహిళలే వంట చేయలేక అల్లాడిపోతుంటారు. కాని పురుషులు వంట చేస్తే హాబీగా చెబుతారు. చాలా మంది నటీమణులు సమయం దొరికితే వంట చేయడం తమ హాబీ అనడం చూస్తుంటాం. బాలీవుడ్ హీరోయిన్ విద్యాబాలన్ కవిత్వం రాసినా ఆమెను నటిగానే పరిగణించి కవిత్వంలో ఔత్సాహిక హొదా ఇస్తారు. రేపు ఆమె అందులో కూడా తన ప్రతిభ నిరూపించుకుంటే అప్పుడు కవయిత్రిగానే అదే స్థాయినిస్తారు. పవన్ కళ్యాణ్ పాటలు పాడతాడు కాని వృత్తిపరమైన గాయకుడు కాదు. ప్రసిద్ధ నిర్మాత రామానాయుడు తన సినిమాల్లో ఏదో ఒక పాత్రలో కనిపించేవాడు. అది ఆయన హాబీ. ఒక దశలో ఎక్కువగా నటించబోయి మళ్లీ విరమించుకున్నారు. బహుముఖ ప్రజ్ఞావంతులైన వారు భిన్నమైన పనులు చేయొచ్చు గాని అది కూడా హాబీ అనిపించుకోదు.

రాజకీయ వ్యాపార కళా రంగాల్లో మునిగితేలే చాలా మంది కుక్కలను పెంచుతుంటారు. వాటి గురించి మాట్లాడుతుంటారు. కాని కుక్కలను పెంచి విక్రయించే వ్యాపారులు వేరే వుంటారు. కనుక హాబీకి వృత్తికీ కళాభ్యాసానికి తేడా వుంటుంది. ప్రజ్ఞావంతులైతే దాంట్లోనూ రాణించి స్థిరపడిపోవచ్చు. అవసరార్థం అదే ఆదుకోవచ్చు. అప్పుడది వృత్తి వ్యాపారాల జాబితాలో చేరిపోతుంది.ఇవన్నీ గాక వారు సంతోషం కోసం మరేదో

చేస్తుంటారు.

మానసిక సంతోషం కోసం.. ఇష్టపూర్వకమైన కాలక్షేపం కోసం చేసే పనినే హాబీ అనగలం. ఇలాటి వాటిలో చెప్పుకోదగినవి కొన్ని:

స్టాంపులు నాణేల సేకరణ

భారతీయుల బహువ్యాప్త హాబీలలో ఇదొకటి. పాత స్టాంపులనూ నాణేలనూ వస్తువులనూ సేకరించడం.. ఈ అలవాటులో పడిన వారికి నిరంతరం అదే వ్యాపకం వ్యసనమై కూచుంటుంది. ఎక్కడెక్కడ దొరికేవి తెచ్చి తమ దగ్గర పెట్టుకుంటారు. ఎంత అరుదైన అపురూపమైన స్టాంపు దొరికితే అంత గొప్ప. అలాగే దేశ దేశాల నాణేలు పురాతన నాణేలు సేకరిస్తుంటారు. ఇందుకోసం డబ్బు కూడా ఖర్చు చేసి కొంటుంటారు. గొప్ప వాళ్లకు సంబంధించిన ఉత్తరాలు వస్తువులు వేలం పాటలో కొని ఘనంగా ప్రదర్శిస్తుంటారు. అది తమ దగ్గర వుండటం వారికెంతో గర్వకారణంగానూ వుంటుంది. ఈ అభిరుచిని సొమ్ము చేసుకోవడం కోసం వ్యాపారాలు చేసే వారు చాలా మంది వుంటారు. బహిరంగంగానే గాక రహస్యంగానూ వాటిని సేకరించి విక్రయిస్తుంటారు.

ఇంతకు ముందే చెప్పినట్టు సాలార్‌జంగ్ అలా ప్రపంచమంతటి నుంచి సేకరించిన వస్తువులే ఇప్పుడు ఆయన పేరిట వెలసిన మ్యూజియంలో ఆబాలగోపాలం చూస్తుంటారు. ఇలాగే పాత కాలపు తాళాలు సేకరించేవారు, మంచాలు కొనుగోలు చేసేవారు తటస్థపడుతుంటారు. పాత పత్రికలన్నీ అట్టిపెట్టుకుని కొందరు ఆనందిస్తుంటారు. ఇది స్థూలంగా. సేకరణ విభాగంలోకి వచ్చేవి ఇంకా చాలా వుంటాయి.

ఆటపాటలు

ఇతర వృత్తి ఉద్యోగాల్లో వుండి హాబీగా సంగీతం, నృత్యం, నటన, చిత్రలేఖనం వంటివి నేర్చుకునే వారు ప్రదర్శించే వారు చాలా మంది వుంటారు. డాక్టర్ పినాకపాణి గొప్ప వైద్యుడు. ఆయన అభిరుచి కొద్ది నేర్చుకున్న వీణ గొప్ప ప్రఖ్యాతి తెచ్చిపెట్టింది. తీరిక వేళల్లో బొమ్మలు వేస్తూ చిత్రకారులైన వారు కూడా వున్నారు. అయితే దాన్ని వారు ప్రధాన వృత్తిగా ఎప్పటికీ చూడకపోవచ్చు. తీరిక లేని వ్యాపారాల్లో మునిగితేలేవారు సాయింత్రం గోల్ఫ్ కోర్సుకో మరోదానికో వెళ్లడం సర్వసాధారణం. ఉద్యమాలు రాజకీయాలు పాలనా వ్యవహారాలతో ఉక్కిరి బిక్కిరయ్యేవారు కూడా క్రికెట్ చూడటం, డిస్కవరీ ఛానల్ వీక్షించడం పరిపాటి. గతంలో చాలా మంది అధికారుల ఉద్యోగులు నాటకాలు వేయడం కోసం తహతహలాడిపోయేవారు. ఇప్పుడు కూడా మిమిక్రీ, నటన, క్విజ్‌లు వంటివాటిలో పాల్గొని గెలుపు కోసం ప్రయత్నిస్తుంటారు. ఇక బాగా డబ్బున్న వాళ్లు గుర్రప్పందాల్లో పాల్గొంటూ

మేధాస్థాయిని బట్టి...

సంతోషం కోసం చేసే పనులు హాబీలంటారు గాని అది కూడా వారి వారి స్థాయిపై ఆధారపడి వుంటుంది. ఐక్యూ చాలా ఎక్కువగా వున్నవారికి వినోదంగా వుండేది వారికంటే తక్కువ స్థాయివారికి శిరోభారం కావచ్చు. ఉదాహరణకు చదరంగం వినోదమా మేధో మథనమా అంటే చెప్పడం కష్టం. కాని మేధావులు రాజనీతిజ్ఞులు చాలా మంది కాస్త మానసిక ఉపశమనం కోసం అదే ఆడుతుంటారు. ఉదాహరణకు కారల్ మార్క్స్ హాబీ కఠినమైన లెక్కలు చేయడమట! అదే ఎంగెల్సు భాషలు నేర్చుకునేవాడు. జవహర్‌లాల్ నెహ్రూ పిల్లలతో గడిపేవాడు. శ్రీశ్రీ ఆరుద్రలు చదరంగంలో ఎత్తులు పై ఎత్తుల గురించి చాలా రాశారు. అక్కినేని నాగేశ్వరరావు కవితలు రాసుకున్నారు. వారెన్ బఫెట్ బ్రిడ్జి ఆడుతుంటాడు. అనిల్ అంబానీ తన సిబ్బందితో మారథాన్‌గా పరుగు పెడుతుంటాడు. అక్షయ్ ఖన్నా తాయ్‌చెన్ అనే మార్షల్ విద్యపై మక్కువ చూపిస్తాడు. షారుక్ ఖాన్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వెతుకుతుంటాడు. తెలుగువారిలోనూ సెలబ్రిటీలతో పాటు సామాన్యులు కూడా రకరకాల హాబీలు అనుసరించడం టేబులాయిడ్ వార్తా కథనాల్లో మనకు కనిపిస్తుంటుంది

శ్రీశ్రీ

ఆరుద్ర

వ్యసనంగా మార్చుకుని దివాళా తీయడం కూడా చూశాం.

పనిపాటలు

ఇవి నిత్యకృత్యాలుగా గాకున్నా జీవితంతో ముడిపడి వుండేవి. ఉదాహరణకు వంటలు నేర్చుకోవడం.. రకరకాల పూల మొక్కలు పెంచడం.. బోన్సాయ్ రకాలతో పెరడు నింపుకోవడం.. చేప పిల్లలను తెచ్చి ఆక్వేరియం ఏర్పాటు చేసుకోవడం.. ఇంటిని రకరకాలుగా అమర్చుకోవడం మార్చుకోవడం.. ముగ్గులు గోరింటాకులు తీర్చిదిద్దుకోవడం వంటివి ఈ తరహాలోకి వస్తాయి. వీటిలో సహకరించడం మరికొందరికి హాబీగా వుంటుంది. తమ పరిధిలో స్థోమతలో చేయగల సహాయం చేయడం, స్వచ్ఛంద సేవలందించడం కొంతమందికి హాబీ అవుతుంది. వైద్యం నేర్చుకోవడం కూడా అలాటిదే.

పరిశీలనలు

ప్రపంచంలోని చాలా దేశాలలో వలెనే మన దేశంలో కూడా అంతరిక్ష వీక్షణం చాలా మందికి ఒక హాబీ. రాత్రి వేళ వీరు టెలిస్కోపు తీసుకుని అలా చూస్తుంటారు. నక్షత్ర గమనాన్ని గ్రహ గతులనూ పరిశీలించి ఆనందిస్తుంటారు. వినేవారుంటే వాటి గురించి ఎంతసేపైనా చెప్పి సంతోష పడతారు. ఇలాగే జంతువులను గురించి తెలుసుకునేవారు, రైల్వే బస్సు విమానాల రాకపోకలను చూసి దగ్గరగా తక్కువ ఖర్చుతో వెళ్లే పద్ధతులు కనిపెట్టేవారు, పొదుపు మంత్రాలు అన్వేషించేవారు ఈ కోవలోకే వస్తారు. ఇక్కడ డబ్బు మిగుల్చుకోవడం కంటే దాన్ని కనిపెట్టడం వల్ల కలిగే సంతోషం ముఖ్యమవుతుంది.

పఠనం.. పర్యాటకం

చాలామంది పుస్తక పఠనం హాబీగా చెబుతుంటారు. ఆనందం కలిగిస్తుంది గనక ఆ విధంగా చెబుతుంటారు. అందులోనూ కథలు కాకరకాయలు మాత్రమే చదివేవారు, లోతైన విషయాలు అధ్యయనం చేసేవారు రకరకాలుగా వుంటారు. విభిన్న భాషలు నేర్చుకుని సంతోషం పొందేవారు, ఎన్నో డిగ్రీలు సంపాదించి సంతోషించేవారు కూడా తారసపడుతుంటారు. వీరికి ఆ పాండిత్యం ఆనందదాయకమవుతుంది గాని ఉద్యోగాలకో మరో దానికో



ఉపయోగపడుతుందని కాదు.

పర్యాటకాన్ని కూడా కొందరు హాబీల్లో చేరుస్తారు గాని అది నిత్య జీవితంలో జరగదు. ప్రత్యేకంగా ప్రణాళిక వేసుకుని జరపాల్సింది.

పోటీలు రికార్డులు

తాము వున్న రంగంలోనే గొప్పవారనిపించుకోవాలన్నది కూడా కొందరికి హాబీగా వుంటుంది. ఇంత పెద్ద దోసె పోశామనీ, ఇంతసేపు మంచుమీద నిల్చున్నామనీ, ఇన్ని ఇడ్లీలు తిన్నామనీ, ఏవేవో రికార్డులు స్వంతం చేసుకుని మురిసిపోతారు.

మానవ సమాజం వైవిధ్య భరితమైంది గనక ఎవరి అభిరుచులూ అలవాట్లూ వారికి వుండటం ఆహ్వానించదగిందే. అలాటి వైవిధ్యమే లేకపోతే జీవితం చాలా యాంత్రికంగా మారిపోతుంది. వ్యసనాలుగా మారని వ్యాపకాలూ హానికరం కాని హాబీలు ఎంతైనా మంచివే. కనుకనే అమిత శక్తి సంపన్నులూ బుద్ధిశాలులూ కూడా తమవైన వ్యాపకాలను సజీవంగా కొనసాగించగలుగుతున్నారు. తలిదండ్రులు కూడా పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆసక్తులను పెంచడం వల్ల వత్తిడి తగ్గి హాయిగా వుంటారని గ్రహిస్తున్నారు.

అవరోధాల మధ్యనే

అదే సమయంలో ఆర్థిక సామాజిక వ్యత్యాసాలు ఈ విషయంలోనూ ప్రభావం చూపకపోవు. అహోరాత్రాలు పనిచేసి అలసిపోయేవారు నిత్య జీవితం గడపడానికే ఆర్థిక శక్తిలేని వారు పైన చెప్పుకున్న ఖరీదైన వ్యాపకాలను కలలో కూడా వూహించలేరు. అయితే అలాటి వారు కూడా గొంతెత్తి పాడుకోగలరు. బృందగానాల్లో పాలుపంచుకోగలరు. అనేక కష్టనష్టాల 'మధ్యలోనే' మహత్తర సమర్థత చూపించి మెప్పించిన వారున్నారు. సరదా అలవాట్లనే సంపూర్ణ స్వరూపంగా మలుచుకున్నవారున్నారు. పిల్లలకు తిండి పెట్టడానికే లేని తల్లి కూడా చిన్న కూనిరాగం తీయొచ్చు. ఇల్లలికి ముగ్గు వేయొచ్చు. అవకాశం వస్తే అందరికీ సేవ చేసి అభినందనలు పొందొచ్చు.

ఎందుకంటే మానవులు శ్రమ జీవులే కాదు, రసజ్ఞ ప్రాణులు కూడా.

◆

సంపాదన మార్గంగానూ....

అనంత శ్రీరామ్

అలవాటు వ్యాపకం, ప్రవృత్తి...ఇవి గుర్తింపు తెచ్చి పెట్టడమేగాదు. మనసుకు ఆనందాన్ని, ఉల్లాసాన్ని ఇస్తాయి. భవిష్యత్తులో ఇవే జీవనాధారంగా మారవచ్చు. నాలుగు రాళ్లు సంపాదించిపెట్టే సాధనాలుగా ఉపయోగపడవచ్చు. చంద్రం ప్రభుత్వంలో చిరు ఉద్యోగి. వంట చేయడం ఆతనికి సరదా. ఇంట్లోనో బంధువుల ఇంట్లోనో చిన్నిచిన్న ఫంక్షన్లు జరిగినపుడు అతనే వంటలు చేసేవాడు. చెయ్యి తిరిగిన వంటగాడయ్యాడు. రిటైర్ అయ్యాక అదే అతనికి అక్కరకొచ్చింది. నువ్వు పని చేయలేవని ప్రభుత్వమైతే పంపేసిందిగానీ...అతనికి ఇంకా పనిచేయగల శక్తివుంది. ఇప్పుడు చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ రిటైర్ అయిన తరువాతా డబ్బు సంపాదిస్తున్నాడు. టిటిడి అటవీ విభాగంలో సాధారణ కార్మికుడు అతను. అడవుల్లో మంటలు అంటుకుంటే ఆర్పడం, గాలికి చెట్లు పడిపోతే తొలిగించడం అతని పని. ఆసక్తికొద్దీ నర్సరీ పనులు నేర్చుకున్నాడు. అందులో విశేషమైన పరిజ్ఞానం సంపాదించాడు. ప్రైవేటుగా పెద్దపెద్ద సంస్థల్లో గార్డెన్ అభివృద్ధి చేయడం ద్వారా అదనంగా డబ్బులు ఆర్జిస్తున్నాడు. 'నేను రిటైర్ అయినా భయం లేదు...ఏ నర్సరీనో పెట్టుకుని దర్జాగా బతికేస్తాను' అని భరోసాగా చెబుతారు ఆయన. సినీ గీత చరయిత అనంత శ్రీరామ్ చదువుకునే రోజుల్లో సరదాగా మొదలుపెట్టిన గీత రచన...ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చిపెట్టడమేగాక...లక్షలు, కోట్లు ఆర్జించిపెడుతోంది. అంతెందుకు గార్డెనింగ్ (ఉద్యాన వనాల పని) మీ అభిరుచి అనుకోండి....మీ పెరట్లోనే కూరగాయలు, ఆకుకూరలు పండించవచ్చు. ఇప్పుడు 'పెరటి తోటలు' అనేది ఒక కాన్సెప్ట్‌గా ముందుకొస్తోంది. దీంతో వంటింట్లో కూరగాయలకు కొదవే ఉండదు. సంపాదనగా, ఆదాయ మార్గంగా ఉపయోగపడే అభిరుచులు ఎన్నో!

వయసుతో పనిలేదు...

విద్యార్థి దశలోనే ఇలాంటివి నేర్చుకోవడం ప్రారంభించాలన్న మాట వాస్తవమేగానీ.... ఆసక్తి వుండాలేగానీ ఏ వయసులోనైనా నేర్చుకోవడం ప్రారంభించవచ్చు. తిరుపతిలో ఓ మ్యూజిక్ ఇన్‌స్ట్యూట్‌కు వెళితే...దాదాపు 50 ఏళ్ల మహిళ గాత్రం నేర్చుకుంటున్నారు. 'నాకు చిన్నప్పటి నుంచి పాటలు పాడే అలవాటుంది. శాస్త్రీయంగా నేర్చుకుంటే ఉపయోగమని చాలా మంది చెప్పారు. ఇంటి బాధ్యతల వల్ల కుదరలేదు. ఇప్పుడు కాస్త ఖాళీ దొదిరికింది. అందుకే నేర్చుకుంటున్నాను. సంగీతం నేర్చుకుని ప్రదర్శనలివ్వాలని కోరికలేదుగానీ...నా ఆనందం కోసం నేర్చుకుంటున్నాను' అని ఉత్సాహంగా చెప్పారు ఆమె. ఓ స్కేటింగ్ శిక్షణా కేంద్రానికి వెళితే...అంతా బుడతలే....ఐదో తరగతిలోపు చిన్నారులే. అయితే ఇంటర్ విద్యార్థి ఒకరు పడుతూ లేస్తూ అతికష్టం మీద రోల్ స్కేటింగ్ నేర్చుకుంటూ కనిపించాడు. 'స్కేటింగ్ చిన్నప్పుడు నేర్చుకుంటేనే సులభంగా వస్తుంది. అయినా అతనికి నేర్చుకోవాలన్న ఆసక్తివుంది. కష్టమైనా తప్పక నేర్చుకుంటాడు' అని చెప్పాడు అక్కడ శిక్షణ ఇచ్చే వ్యక్తి.

ముందుగా మీకు ఎందులో ఆసక్తి వుందో తెలుసుకోవాలి. ఏ పనిలో ఆనందం కలుగుతుందో గమనించాలి. అది మీ అలవాటనో, అభిరుచి అనో అని తెలియకపోవచ్చు. రోజువారి జీవన శైలిలో భాగంగా మారిపోయి వుండొచ్చు. ఉదాహరణకు రోజూ ఒక సినిమా అయినా చూడంది నిద్రపోరు. అంటే మీకు సినిమాలపై అభిరుచి ఉందన్నమాట. దానికి సంబంధించిన విషయాలను నేర్చుకోవచ్చు. మీ చిన్ననాటి అభిరుచులను గుర్తు చేసుకున్నా కొత్తగా ఏ నైపుణ్యం సాధించాలో తెలుసుకోవచ్చు. చిన్నప్పుడు మీకు డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం. ఆదే రంగంలో నైపుణ్యం సాధింవచ్చు. దీనికి సంబంధించిన ఇంటీరియ్ డిజైనింగ్ వంటివి నేర్చుకోవచ్చు. మీకు ఎందులో ఆసక్తివుందో మీ కుటుంబ సభ్యులు, మిత్రుల ద్వారానూ తెలుసుకునే అవకాశముంది.

ఇప్పటి టీవీ ఛానళ్లలో, సినీ వేదికలపై యాంకరింగ్ చేస్తున్నవారు....యాంకర్ కావాలనుకుని ఆ రంగంలోకి వచ్చినవారు కాదు. చిన్నప్పటి నుంచి ఉన్న అభిరుచికి మెరుగులు దిద్ది దాన్నే వృత్తిగా మార్చుకున్నారు. చదవడం కూడా ఒక అలవాటే...దీనివల్ల విషయ పరిజ్ఞానం, ఆలోచనల విస్తృతి పెరుగుతుంది. కాలానుగుణంగా కొత్త కొత్త అభిరుచులూ పుట్టకొస్తున్నాయి. ఫేస్‌బుక్ వీక్షించడం, పోస్టులు చేయడం, అభిప్రాయాలు పంచుకోవడం సరికొత్తగా, విస్తృతంగా సాగుతున్న అభిరుచి.

-ఆదిమూలం శేఖర్

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -12)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

ప్రూధోను విమర్శించటంతో ప్రారంభించిన మార్క్సు గురించి చాలా ఎక్కువగా రాశాడు. ఎంగెల్స్ పరిచయంతో కలిగిన ప్రేరణ ఇందుకో కారణం కావచ్చు. లేదా గత సంవత్సరంగా తనలో సుళ్లు తిరుగుతున్న భావాలన్నీ కాగితం మీద పెట్టాలన్న కోరికా కావచ్చు.

జనవరి నాటికి ఇంకా పుస్తకం పూర్తి కాలేదు. ఆర్థికశాస్త్ర విషయాల గురించిన కృషి కూడా కొనసాగటం లేదు. ఈ ఆలస్యం గురించి ఎంగెల్స్ ఓ సలహా ఇచ్చాడు. 'పొలిటికల్ ఎకానమీ పుస్తకం త్వరగా ముగించు. చేసిన పని మనకు పూర్తిగా తృప్తి కలిగించకపోవచ్చు. అయినా పరవాలేదు. పని పూర్తి చేయటానికి ఏదో ఒక తేదీ నిర్ణయించుకుని అప్పటివరకు ఎలాగైనా సరే, ఎలాగున్నాసరే, ప్రచురణకు సిద్ధం చెయ్యి'.

అయితే, ఇటీవల పారిస్‌లో జరిగిన పరిణామాలు ఎంగెల్స్‌కు తెలియవు. తొమ్మిది రోజుల క్రితం ఫ్రెంచి హోంమినిష్టర్ ఒక ఆదేశం జారీ చేశాడు. దాని ప్రకారం ఇరవై నాలుగు

> **“ జెన్నీ కూడా ఈ ఒడుదుడుకుల జీవితం నుండి విముక్తి కోరుకుంది. పారిస్ నుండి మార్క్స్ బయల్దేరుతున్నప్పుడు బ్రసెల్స్‌లో తనకేం కావాలో ఒక లిస్టు రాసిచ్చింది. రాజరికాలకు ముగింపు పలకాలని, రాజులను తుదముట్టించాలని పిలుపునిచ్చిన మార్క్స్‌కు “బీరువాలు, కబర్డ్స్ చాలా ముఖ్యం. వంట సామాను గురించి అంతగా ఆలోచించక్కర్లేదు. కనీసం నాలుగ్గదులు, కిచెన్ వున్న ఇల్లు కావాలి. అదనంగా, అక్కర్లేని వస్తువులు దాచుకోవటానికి మరో గది... కనీసం మూడు గదుల్లో హీటింగ్ వుండాలి. నువ్వు పని చేసుకునే గదిలో అవసరమైన ఫర్నిచర్ అమర్చుకోవాలి...' అంటూ సలహాలిచ్చిందా ఇల్లాలు. ”**

గంటల్లోగా ఫార్వర్డ్ పత్రిక సిబ్బంది కొందరు – మార్క్స్, హైన్, రూగ్, బెర్నేస్, బకూనిన్ నగరం విడిచి వెళ్లాలి. ఆ తర్వాత దేశం నుండి కూడా నిష్క్రమించాలి. ప్రష్యన్ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్, జర్మన్ రాజు ఫ్రీడ్రిక్ విల్హెల్మ్ ఇచ్చిన ఒక కానుకను లూయీ ఫిలిప్‌కు సమర్పించి ఈ 'నాస్తికులకు' దేశ బహిష్కరణ శిక్ష విధించమని కోరాడు. పొరుగు దేశంతో శాంతియుత సంబంధాలే అభిలషణీయం అనుకున్న ఫ్రెంచి రాజు ఈ దుందుడుకు రచయితల్ని ఫ్రాన్స్ నుండి పంపించి వెయ్యటానికి వెంటనే అంగీకరించాడు. జెన్నీ ప్రకారం, ఆదివారంనాడు పోలీస్ కమిషనర్ తమ అపార్టుమెంటుకు వచ్చి 'బహిష్కరణ ఆర్డర్' ఇచ్చి వెళ్లాడు.

ఇలాంటిదేదో జరుగుతుందని మార్క్స్‌కు తెలుసు. అయితే జెన్నీ మాత్రం పరిస్థితి ఇంతదాకా వస్తుందనుకోలేదు. పారిస్ ఆమెకు ఎంతగా నచ్చిందంటే ఇప్పుడామె 'పారిసియన్'గా మారిపోయింది. దంపతులుగా తాము కొత్త జీవితం ప్రారంభించిన నగరమది. అక్కడే కూతురు పుట్టింది. మిత్రబృందమంతా అక్కడే వుంది. 'బహిష్కరణ ఆదేశం'లో ఒక చిన్న వెలుగు రేఖ కనిపించింది. అందులో పేర్కొన్న వాళ్లందరూ 'ఇక ముందర రాజకీయాల్లో పాల్గొనం' అని హామీ ఇస్తే నగరంలో కొనసాగవచ్చు. మార్క్స్, బకూనిన్ తప్ప మిగతా వాళ్లందరూ అందుకు అంగీకరించారు. 'ఇది ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. పోలీసు నిఘాకు లోబడి బతకలేను' అన్నాడట మార్క్స్. ప్రష్యాలో నిర్బంధాన్ని అనుభవించాడు. ఇక్కడ 'స్వేచ్ఛ' దొరికింది. ఒకసారి స్వేచ్ఛను రుచి చూసిన మనిషి ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని వదులుకోవటానికి సిద్ధపడడు.

చివరికి ఫిబ్రరి 2, 1845 నాడు స్టేజ్‌కోచ్‌లో బయల్దేరి, ఫిబ్రవరి 5 నాటికి బ్రసెల్స్ చేరుకున్నాడు మార్క్స్. యువ జర్నలిస్టు హైన్రిష్ బర్గర్స్ తన వెంట వచ్చాడు.

జెన్నీ, పారిస్‌లోనే వుంది. హితైషులు అనేకమంది వచ్చి సానుభూతి వ్యక్తం చేశారు. కాని అప్పుడామెకు కావలసింది ఆర్థిక సాయం. కార్ల్ ఆమెకు 200 ఫ్రాంకులిచ్చి వెళ్లాడు. కేవలం ఇంటి అద్దె 380 ఫ్రాంకులు చెల్లించాలి. చేసేది లేక, ఎంత వచ్చినా

చాలనుకుని ఫర్నిచర్ అమ్మేసింది జెన్నీ. మొత్తం మీద ప్రయాణానికి డబ్బు సమకూరింది. అనారోగ్యంతో బాధపడుతూ, బ్రసెల్స్ బయల్దేరింది జెన్నీ. జీవితమంతా దేశం నుండి దేశానికి చేసిన అనేక ప్రయాణాల్లో అది మొదటిది మాత్రమే.

బ్రసెల్స్, వసంతకాలం 1845 నియంతృత్వాల లాంటి రాజరికాలున్న యూరప్‌లో బెల్జియం కాస్త మెరుగు. హాలండ్ నుండి విడిపడి పదిహేనేళ్ల క్రితమే స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఇక్కడా రాజున్నాడు. కాని రాజ్యాంగం కూడా వుంది. మిగతా యూరోపియన్ దేశాలతో పోల్చితే ఇక్కడి చట్టాలు కూడా సరళం. తళుకు బెళుకులు లేవు గాని (పారిస్ మహానగరమైతే ఇది చిన్న వూరు!) అంతకుమించిన స్వేచ్ఛా వాతావరణముంది. ఇక్కడికొచ్చే శరణార్థులు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనకూడదనీ, బలమైన తమ ఇరుగు పొరుగు దేశాల ప్రభుత్వాలకు ఇబ్బంది కలిగించే పద్ధతిలో వ్యవహరించకూడదని మాత్రమే సూచించాడు లియొపాల్డ్‌క్ష్మే ప్రభువు. నిజానికి, పారిస్‌లో ఇలాంటి నిబంధనలకే తను వ్యతిరేకమన్నాడు మార్క్స్. కాని 'వ్యక్తిగత', 'వృత్తి' కారణాల వల్ల బెల్జియంలో వాటినే అంగీకరించాడు. జెన్నీ మళ్లీ గర్భవతి. అదీగాక, పారిస్‌లో వున్నప్పుడే పొలిటికల్ ఎకానమీ గురించి ఒక పుస్తకం రాయటానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు.

ఘనత వహించిన ప్రభువుల వారి 'మోస్ట్ ఒబిడియెంట్ సర్వెంట్'గా లియొపాల్డ్‌కు రాసిన లేఖలో 'నన్ను భార్యాపిల్లల్తో బెల్జియంలో వుండనిస్తే తాజా రాజకీయాల గురించి ఇక్కడ ఏమీ ప్రచురించనని వాగ్దానం చేస్తున్నాను' అని విన్న వించుకున్నాడు మార్క్స్. ఈ అభ్యర్థనను లియోపాల్డ్ అంగీకరించాడు. ఇక మార్క్స్ నిరభ్యంతరంగా బెల్జియంలో వుండవచ్చు. కాని, అంతమాత్రాన అతని మీద నిఘా వుండదని కాదు. 'ఈ ప్రష్యన్ ఆందోళనకారుణ్ణి ఓ కంట కనిపెట్టి వుండాలని' ఫ్రెంచివాళ్లు బెల్జియన్ అధికారులను కోరారు. 'ప్రష్యన్ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే ఏ చర్య మీ దృష్టికి వచ్చినా మాకు సమాచారమివ్వండి' అని బ్రసెల్స్ మేయర్‌కు వర్తమానమందింది. ఆ తర్వాత, కొంతకాలానికే వాళ్ల అనుమానం కాస్తా నిజమైంది. రాజకీయాల గురించి రాయనని వాగ్దానం చేసిన మార్క్స్, కొన్నాళ్ల తర్వాత యూరోపియన్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన విప్లవ కార్యాచరణ ప్రణాళిక 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురించాడు.

జెన్నీ కూడా ఈ ఒడుదుడుకుల జీవితం నుండి విముక్తి కోరుకుంది. పారిస్ నుండి మార్క్స్ బయల్దేరుతున్నప్పుడు బ్రసెల్స్‌లో తనకేం కావాలో ఒక లిస్టు రాసిచ్చింది. రాజరికాలకు ముగింపు పలకాలని, రాజులను తుదముట్టించాలని పిలుపునిచ్చిన మార్క్స్‌కు "బీరువాలు, కబర్డ్స్ చాలా ముఖ్యం. వంట సామాను గురించి అంతగా ఆలోచించక్కర్లేదు. కనీసం నాలుగ్గదులు, కిచెన్ వున్న ఇల్లు కావాలి. అదనంగా, అక్కర్లేని

హెలెన్ డిమూత్

"జెన్నీ కన్నా ఆరేళ్లు చిన్నది హెలెన్. అంటే, మార్క్స్ కన్నా రెండేళ్లు చిన్న. మార్క్స్ ఇంట్లో అందరూ ఆమెను 'లెంచెన్' అని పిలుస్తారు. పదకొండేళ్లున్నప్పుడే ఆమె వెస్ట్ ఫాలెన్‌ల ఇంట్లో పనిమనిషిగా కుదిరింది. జెన్నీ, ఎడ్గార్, కార్ల్‌తో చనువెక్కువ. 1845లో జెన్నీ రెండవసారి గర్భం దాల్చిన తర్వాత, ఇద్దరు పిల్లలతో ఒక్కతీ చేసుకోలేదని, జెన్నీ తల్లి లెంచెన్‌ను కూతురి వెంట బ్రెసెల్స్‌కు పంపింది. కొత్త వూరికి చేరిన వెంటనే ఇంటి పని బాధ్యతంతా తన మీద వేసుకుంది లెంచెన్. జెన్నీకి విశ్రాంతి మాత్రమే కాదు, భర్తకు సాయం చెయ్యటానికి కూడా సమయం దొరికింది."

వస్తువులు దాచుకోవటానికి మరో గది... కనీసం మూడు గదుల్లో హీటింగ్ వుండాలి. నువ్వు పని చేసుకునే గదిలో అవసరమైన ఫర్నిచర్ అమర్చుకోవాలి...' అంటూ సలహాలిచ్చిందా ఇల్లాలు. తమ దేశదిమ్మరి బతుకు ఇప్పటికైనా ముగించి ఎక్కడోచోట స్థిరంగా వుండాలని ఆమె కోరిక.

కాని, బ్రసెల్స్ చేరినా, పరిస్థితిలో ఏ మార్పూ రాలేదని గ్రహించింది జెన్నీ. కార్ల్ ఇల్లు వెదకలేదు. తనూ, జెన్నీచెన్, పాలదాయి ఒక బోర్డింగ్‌హౌజ్‌లో ఉన్నారు. అయితే, పారిస్‌తో పోల్చితే ఇక్కడి జీవితం చాలా ప్రశాంతంగా వుంది. మార్క్స్ అంటే గిట్టనివాళ్లు అతని చుట్టూ వున్న వాళ్లకు 'మార్క్స్ పార్టీ' అని పేరు పెట్టారు. నిజానికి, అతని వెంట వున్న వ్యక్తుల సంఖ్య అంత ఎక్కువేమీ లేదు. అయితే, ఈ 'పార్టీ' సభ్యులందరూ మొదటిసారి బ్రసెల్స్‌లో సమావేశమయ్యారు.

మార్క్స్, బ్రసెల్స్‌కు చేరిన వెంటనే కవి ఫెర్దినాండ్ ఫ్రైలిగ్రాత్‌ను వెదికి పట్టుకుని, ఆయనకు క్షమాపణ చెప్పటానికి బయల్దేరాడు. మూడేళ్ల క్రితం, తను రైనిష్ జైటుంగ్‌కు సంపాదకుడుగా వున్నప్పుడు అతడి పట్ల దురుసుగా వ్యవహరించాడు. అప్పటికి, వృత్తిరీత్యా వ్యాపారస్తుడిగా వున్న ఫ్రైలిగ్రాత్, జర్మనీలోని ప్రముఖ కవుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. (వ్యాపారస్తుడు గనక, ఆ విషయంలో ఎంగెల్స్‌కు అతడు ప్రేరణ.) హెర్వేగ్‌లాగ అతడికి రాజకీయ కారణాల వల్లగాక కేవలం కవిత్వం వల్ల పేరొచ్చింది. 'కవులు ఈ లౌకిక విషయాలకు పెద్దగా స్పందించకూడదు' అంటూ ఒకసారి హెర్వేగ్‌తో తగాదా కూడా పెట్టుకున్నాడు. 1842లో ప్రష్యన్ రాజు ఆయనకు భరణం ప్రకటించటంతో రైనిష్ జైటుంగ్ ఫ్రైలిగ్రాత్‌ను 'స్వేచ్ఛకు శత్రువు'గా ప్రకటించింది.

ఆ తర్వాతి రెండేళ్లలో ప్రష్యన్ ప్రభుత్వం మరింత రియాక్షనరీగా మారటంతో ఫ్రైలిగ్రాత్ కవిత్వం కూడా రాజకీయ రంగు సంతరించుకుంది. 1844లో ఆయన పుస్తకం 'పేట్రియాటిక్ ఫాంటసీస్'ను నిషేధించారు. ఫ్రైలిగ్రాత్ తన రాజభరణాన్ని తిరస్కరించాడు. రాజుగారికి కోపం వచ్చింది. ఫ్రైలిగ్రాత్, ప్రష్యా విడిచి బెల్జియం చేరుకుని భార్యతో ప్రశాంతంగా గడుపుతున్నాడు. మార్క్స్ దంపతులు బ్రసెల్స్ చేరేనాటికి అదీ అతడి పరిస్థితి. త్వరలోనే రెండు కుటుంబాల మధ్యా స్నేహం పెరిగింది.

ఆ తర్వాత కొద్దికాలానికే ఫ్రైలిగ్రాత్ స్విట్జర్లాండుకు వెళ్లిపోయాడు. మార్క్స్ కూడా కొత్త ఇంటికి మారాడు. అనేకమంది పాత, కొత్త మిత్రులతో కళకళలాడిందా మూడంతస్తుల భవనం. అయితే, అక్కడ మార్క్స్ జీవితంలో భాగస్వాములుగా ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఒకరు హెలెన్ డిమూత్, మరొకరు ఎంగెల్స్.

జెన్నీ కన్నా ఆరేళ్లు చిన్నది హెలెన్. అంటే, మార్క్స్ కన్నా రెండేళ్లు చిన్న. మార్క్స్ ఇంట్లో అందరూ ఆమెను 'లెంచెన్' అని పిలుస్తారు. పదకొండేళ్లున్నప్పుడే ఆమె వెస్ట్ ఫాలెన్‌ల ఇంట్లో పనిమనిషిగా కుదిరింది. జెన్నీ, ఎడ్గార్, కార్ల్‌తో చనువెక్కువ. 1845లో జెన్నీ రెండవసారి గర్భం దాల్చిన తర్వాత, ఇద్దరు పిల్లలతో ఒక్కతీ చేసుకోలేదని, జెన్నీ తల్లి

లెంచెన్‌ను కూతురి వెంట బ్రెసెల్స్‌కు పంపింది. కొత్త వూరికి చేరిన వెంటనే ఇంటి పని బాధ్యతంతా తన మీద వేసుకుంది లెంచెన్. జెన్నీకి విశ్రాంతి మాత్రమే కాదు, భర్తకు సాయం చెయ్యటానికి కూడా సమయం దొరికింది. లెంచెన్ రాజకీయ అభిప్రాయాల గురించి మనకేమీ తెలియదు గాని, ఇంటికి వచ్చే కమ్యూనిస్టులు, సోషలిస్టులతో కలిసిపోయి వాళ్ల కుటుంబంలోని ఒక ముఖ్య వ్యక్తిగా మారిందామె. ఆ ఇంట్లో ఎవరూ ఆమెను పరాయి వ్యక్తిగా చూడలేదు. 'పెళ్లి చేసుకోవడానికి అనేక అవకాశాలు వచ్చినా, మార్క్స్ దంపతులతో వుండటానికే ఇష్టపడిందామె' అన్నాడొక కుటుంబ సన్నిహితుడు.

> **" ఇలాంటిదేదో జరుగుతుందని మార్క్స్‌కు తెలుసు. అయితే జెన్నీ మాత్రం పరిస్థితి ఇంతదాకా వస్తుందనుకోలేదు. పారిస్ ఆమెకు ఎంతగా నచ్చిందంటే ఇప్పుడామె 'పారిసియన్'గా మారిపోయింది. దంపతులుగా తాము కొత్త జీవితం ప్రారంభించిన నగరమది. అక్కడే కూతురు పుట్టింది. మిత్రబృందమంతా అక్కడే వుంది. 'బహిష్కరణ ఆదేశం'లో ఒక చిన్న వెలుగు రేఖ కనిపించింది. అందులో పేర్కొన్న వాళ్లందరూ 'ఇక ముందర రాజకీయాల్లో పాల్గొనం' అని హామీ ఇస్తే నగరంలో కొనసాగవచ్చు. మార్క్స్, బకూనిన్ తప్ప మిగతా వాళ్లందరూ అందుకు అంగీకరించారు. "**

ఆ సమయంలో లెంచెన్ అక్కడికి రావటం మంచిదైంది. ఎంగెల్స్ రాకతో గందరగోళంగా తయారైన ఇంటిని ఓ పద్ధతిలో పెట్టిందామె. మార్క్స్ వుంటున్న ఇంటి పక్కనే మరో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు ఎంగెల్స్. కాని ఇంచుమించు సమయమంతా ఇక్కడే గడిపేవాడు. ఎనిమిది నెలల క్రితం పారిస్ వదిలిన తర్వాత ఇంటికెళ్లి (ఏశీఅసట్‌ఱశీఅం శీట్ ష్త్రవ షశీతీఱఅస్త్ర ఏశ్రీఓంం ఱఅ జుఅస్త్రశ్రీఓఅఱ) ముగించాడు. (అందులో ఇంగ్లీష్ బూర్జువా వర్గం ఫ్యాక్టరీలలో హత్యలు, దోపిడీలు, ఇతర నేరాలకు పాల్పడింది' అని రాశాను అని మార్క్స్‌కు చెప్పాడు.) ఇంటి దగ్గర తండ్రితో తగాదా పెట్టుకున్నాడు. కొడుకు ధోరణి తండ్రికి నచ్చలేదు. పెద్దాయన మనసు బాధ పెట్టకూడదని ఫ్యాక్టరీ వ్యవహారాలు చూడటానికి అంగీకరించాడు. అయినా



మార్క్స్‌కు రాసిన ఒక లేఖలో 'ఫ్యాక్టరీకి వెళ్లాలంటేనే అసహ్యమేసింది. అంతకాలం వృథా చెయ్యటమే నచ్చలేదు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే బూర్జువాను నేను. ఆ అమానుషత్వాన్ని తలచుకుంటేనే జుగుప్స కలుగుతుంది.

ఆ తర్వాత, ఉద్యోగం మానేసి, (ఇప్పుడు తనకు ఫ్యాక్టరీతో ఏ సంబంధమూ లేదు) మోజెస్‌హెస్‌తో కలిసి రైన్‌లాండ్‌లో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాడు. సహజంగానే ఈ కార్యకలాపాలు పోలీసుల దృష్టినాకర్షించాయి. 'సాహిత్యకుని ముసుగులో తిరిగే కరడు కట్టిన కమ్యూనిస్టు' అని ఎంగెల్స్ గురించి రిపోర్ట్ చేశారు. కొడుకు అరెస్టయితే, కుటుంబం పరువు పోతుందని భయపడ్డ తండ్రి డబ్బులిచ్చి మరీ బ్రసెల్స్‌కు పారిపొమ్మన్నాడు. ఎంగెల్స్‌కు కావలసింది కూడా అదే. ఎలాగైనా బ్రసెల్స్‌కు చేరుకోవాలనే తన కోరిక.

అక్కడికి వెళ్లటానికి ముందే, 'సైద్ధాంతిక విషయాలు కట్టిపెట్టి కార్యాచరణ మీద దృష్టి పెట్టాలి' అని మార్క్స్‌కు స్పష్టం చేశాడు ఎంగెల్స్. మే నెలలో 'ఇంగ్లిష్ వర్కింగ్ క్లాస్' పుస్తకం జర్మనీలో ప్రచురితమవుతుంది. 'దాని మీద వచ్చే రాయల్టీ అంతా ఇచ్చేస్తాను. కనీసం అలాగైనా మీకు కుటుంబ భారం కొంత తగ్గుతుంది. మా నాన్న పంపించే డబ్బులతో నేను సుఖంగానే బతకగలను' అని కూడా ధైర్యం చెప్పాడు.

ఇంత ఉత్సాహవంతుడైన యువకుడు తనకు మిత్రుడిగా దొరకటంతో పొంగిపోయాడు మార్క్స్. జెన్నీ కూడా సంతోషించింది. (ఇన్నాళ్లూ ఎంగెల్స్‌కు 'మిసెస్ మార్క్స్' పేరు వింటేనే బెరుకు) ఇక ఎంగెల్స్ – కార్ల్‌తో కలసి పని చేయాలనుకుంటే జెన్నీతో కూడా సఖ్యతగా ఉండక తప్పదు. మార్క్స్‌కు ఆమె కుడి భుజం– అక్షరాలా. మార్క్స్ డ్యూయెల్‌లో గాయపడ్డాడని విన్నప్పుడు ఇక అతడు రాయటానికి చేయి సహకరించకపోతే, తను అతనికి రాసి పెడతామనుకుంది. ఇప్పుడు మార్క్స్ నివాసమే మిత్రులందరికీ కేంద్రం. ఇదీ ఒకందుకు మంచిదే అనుకుంది జెన్నీ. పారిస్‌లో లాగ, ఇప్పుడతడు రాత్రుళ్లు మీటింగులంటూ ఎక్కడెక్కడికో తిరిగి రానక్కర్లేదు. ఇంటికొచ్చిన వాళ్ల యోగక్షేమాలు కనిపెట్టి చూసుకుంటుంది 'మిసెస్ మార్క్స్'.

ఇంట్లో పెద్దగా సదుపాయాలేమీ లేవు. అయినా ఉన్నదాంట్లో అందరూ సుఖంగానే ఉన్నారు. ఎవరి దగ్గర ఏదున్నా అందరూ పంచుకుంటారు. వచ్చినవాళ్లతో సహా కలసి భోజనం చేస్తారు. కలిసి ఆటలాడతారు... కలిసి 'తాగుతారు'.

1845వ సంవత్సరం యూరోప్‌కు శాపంగా పరిణమించింది. చేతికొచ్చిన పంట పాడైంది. బంగాళాదుంపకు చీడ పట్టింది ఐర్లండ్‌లో ప్రారంభమైన ఈ చీడ యూరోప్ అంతటా విస్తరించింది. ఆహార నిల్వలు తగ్గిపోయాయి. ఇన్నాళ్లూ భూమిని నమ్ముకుని బతికిన రైతులు, పొట్ట చేత పట్టుకుని కూలీ కోసం నగరాలకు వలస వచ్చారు. అంతమాత్రం చేత ఇక్కడ పరిస్థితి బాగుపడుతుందని నమ్మకం లేదు. ఎక్కడైనా ఆకలి చావులే. ప్రయాణ ఖర్చులు భరించగలిగిన వాళ్లందరూ వలసపోయారు. ఆ ఒక్క సంవత్సరమే లక్షమంది అమెరికా (ఖ.ూ.ూ) వెళ్లారు. అది ప్రారంభం మాత్రమే. ఆ తర్వాత మరెన్ని లక్షల మంది అక్కడికి శరణార్థులుగా చేరుకున్నారో! పొలాలను విడిచి వచ్చిన వాళ్లు ఎక్కువ దూరం ప్రయాణించలేక, దగ్గరగా వున్న నగరాల్లో తమ అదృష్టం వెదుక్కున్నారు. ఊళ్లనూ, నగరాలనూ కలిపే దారులు, వలస వస్తున్న జనాలతో, బళ్లతో కిక్కిరిసిపోయాయి. వ్యాధులు ప్రబలాయి. నేరాలూ, వ్యభిచారమూ, సర్వసాధారణమైపోయాయి. పిల్లల్ని అమ్ముకోవటం కూడా పెరిగింది. పరిశ్రమల యజమానులకు ఇదో ఊహించని వరం. కూలీ ఇవ్వక్కర్లేదు. రొట్టె ముక్కలకైనా పనిచేస్తారు పిల్లలు. వ్యవసాయం పూర్తిగా నాశనం కావటంతో అల్లర్లు చెలరేగే ప్రమాదం పొంచి ఉంది.

సశేషం

■ ఫోన్: 91776 18708

పాటల 'గోగు మల్లెలు'

ఇవి తెలంగాణ దళిత బహుజన పాటలు. ఈ పంపుటిలో దాదాపు 75 పాటలున్నాయి. శ్రామిక వర్గ జాగృతి కోరే పాటలు చాలా ఉన్నాయి. ఓ కవిగా, గాయకుడిగా, తన లోలోతుల్లోని బాధని, దుఃఖాన్ని, కోపాన్ని, అనుబంధాన్ని ఈ "గోగు మల్లెలు" పాటల సంకలనం ద్వారా అందించారు కవి వెంకన్న. ఈ పాటలు వేదికల మీద, క్యాసెట్లు, సీడీల ద్వారా ప్రచారం పొందాయి. ఉత్పత్తి కులాల గురించి, బెస్త కులాల గురించి, బీసీల గురించి, వొడ్డిరాజు, పూలే, కాన్షీరామ్ లాంటి వారి గురించి రాసిన పాటలూ ఈ సంకలనంలో ఉన్నాయి. 1. వందనాలు... వందనాలు వందనాలమ్మో! తెలంగాణ తల్లీ నీకు దండాలోయమ్మో (వందనాలు), 4. నెనరుగల్ల నా తెలంగాణ రా /నెర్రెబారిన సంగతి వినరా.. (పేజీ.6), 7. రోజింత నిరుపేద వైతున్న రైతన్న! రోగాల పుట్టయినా మన చరిత్ర జూడన్న (పేజీ.15), 11. కాలు గజ్జె గట్టుకొని.. ఆటాడుదమా! కమ్మని రాగాల గొంతెత్తుదమా! (పేజీ.24), 13. ప్రజా తెలంగానమా.. నా ప్రాణమైన గానమా.. పాలపిట్ట రూపము నా జమ్మిచెట్టు త్యాగమా (పేజీ.30), 15. అన్నన్నా మా ఓటరన్నా!, 16. తాల్లో ఎన్నియల్లో (పేజీ.43), 19. కదిలెను పాపన్నా, 37. కలిగంజికి లేనోల్లు (పేజీ.100), 39. ఆది జాంభవంతుడ నేను (పేజీ.106), 40. రగిలింది యువజనం–కదిలింది మహాజనం (పేజీ.109), 43, వొడ్డిరాజుల కన్న తల్లి బాలనాగమ్మా! వొడ్డెల్లో రాజ్యమెక్కడ బాయెనోయమ్మా (పేజీ.117), 45. మూలాలు జూడాలె తమ్ముడా! మూలగ్రంథాన్ని దేవాలె తమ్ముడా (పేజీ.122), 74. నీలగిరి (పేజీ.182), 75. ఓయమ్మ నల్లగొండ ఒడుపు లేని ఎర్రగొండ (పేజీ.184) లాంటి పాటలు ఉత్తేజాన్ని, ఊపును.. ప్రతిధ్వనిస్తాయి. తెలంగాణ పాట అనగానే నాటి సుద్దాల హన్మంతు, యాదగిరి, తిరునగరి, దాశరథి గుర్తుకొస్తారు. జానపదాల గుండెల సవ్వడి జనం పాట... తూటా కన్నా శక్తివంతమైంది. సామాజిక చైతన్య భావస్ఫోరక పాటల్ని సంకలనంగా అందించిన "అంబటి" కృషి అభినందనీయం.

గోగు మల్లెలు (పాటలు), రచన : అంబటి వెంకన్న, పేజీలు : 184, వెల : రూ.60/-
ప్రతులకు : జాబిలి ప్రచురణలు, ఇ.నెం.7-1-155/డి9/7, శ్రీనగర్ కాలనీ, పానగల్‌రోడ్, నల్గొండ - 508 001, సెల్ : 9966376072

అక్షరంతో 'అలజడి'

ప్రముఖ చిత్రకారులు శీలా వీర్రాజు గారి కుంచెతో వేసిన 'ముఖ' చిత్రం (అట్ట) అట్టవెనుక అద్దేపల్లి రామమోహన్‌రావు, చింతపట్ల సుదర్శన్‌గార్లు అభిప్రాయాలు ఈ పుస్తకానికి నిండుతనం తెచ్చాయి. కుందుర్తి వచన కవితకు ఆద్యుడైతే.. మినీకవితకు 1970లలో సి.వి. (సి.విజయలక్ష్మి), అద్దేపల్లి రామ్మోహన్‌రావు, ఆ తరువాత రోజుల్లో రావి రంగారావుగార్లు విస్తృత ప్రచారం, ప్రాచుర్యం, ప్రోత్సాహం కల్పించారు. హైదరాబాద్ పాత నగర రచయితల సంఘం ఆవిర్భావానికి ముందే 'అగ్ని పుష్పాలు' పూయించారు ఈ కవి. ఆనాటి కవుల్లో గొట్టిపర్తి యాదగిరిరావు ఒకరు. 1980 ప్రాంతానికి ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ కవి, కవితలు ఇప్పుడు 'అలజడి'గా పుస్తకాకృతి దాల్చాయి. 48 కవితలున్న ఈ కవితా సంపుటిలోని కొన్ని కవితల్ని చూద్దాం : జ్ఞాపకాల తెరమీద / గత స్మృతులు మెరుపుల్లా కదులుతున్నై / మధురమైన ఆ స్మృతులు / మస్తిష్కల పొరల్ని తడుతుంటే / గతంలోకి ప్రవేశించిన ఈ మనసు అంటారు 'అలజడి' కవితలో (పేజీ.15). ఆశ అనే / విద్యుత్తు ఉన్నప్పుడే / ఇంకా రాలని / ప్రాణం ఫిలమెంట్ / జీవితం బల్బులో / వెలుగుతోంది (పేజీ.31) అంటారు 'ఫిలమెంట్' కవితలో కవి. ప్రకృతికి జరుగుతున్న విఘాతాల్ని నిరసించడం, జీవితంలో బాధలు, రాజకీయాలు, భావుకత వీరి కవితల్లో కనిపిస్తాయి. నడుం బిగించి / నలుగురి ముందు నిలిచి / ప్రజలకై పోరాడితే / 'దేశద్రోహి' / నోట్లను గుప్పించి, నలుగుర్ని బెదిరించి / ఓట్లకై పరుగిడితే / 'దేశోద్ధారకుడు' (పేజీ.49). ఇలా నేతల మనస్తత్వాల్ని, రీతుల్ని, కవిత్వీకరించడం పాఠకుల్ని జాగృతం చేస్తుంది.



అలజడి, కవి : గొట్టిపర్తి యాదగిరిరావు, పేజీలు : 58, వెల : రూ.50/-, ప్రతులకు : కవి పేరుతో, 203, తిరుమల అపార్ట్‌మెంట్స్, 16-11-771, అండాల్ ప్లాజా, మూసారాంబాగ్, మలక్‌పేట, హైదరాబాద్ - 500 036.

'పర్యావరణ చైతన్యం'కై కదలాలి!

పర్యావరణ పరిరక్షణ అంటే ప్రకృతిని కాపాడటం. ప్రకృతిని కాపాడటమంటే మనిషితో బాటు ఇతర జీవులను పరిరక్షించాలి. ప్రకృతి పరిరక్షణ కంటే ఈ రోజు మనిషి వాణిజ్య విలువలకే పట్టం కడుతున్నాడు. అధికోత్పత్తి ప్రధాన లక్ష్యంగా జన్యు మార్పిడి పంటల పట్ల ఆసక్తి చూపుతున్నాడు. జన్యు మార్పిడి పంటలు విష తుల్యాలు. ప్రస్తుతం ఇవి 29 దేశాల్లో సాగవుతున్నా, ఈ పంటల వల్ల జరిగే అనర్థాలపై లోతైన అధ్యయనాలు చేయాలి. భవిష్యత్ తరాల కోసం పోరాడాలి. గ్లోబల్ వార్మింగ్ (భూతాపం), సంభవించబోయే విపత్తుల గురించి ఈ గ్రంథంలో రచయిత సమగ్రంగా చర్చించారు. అలాగే పారిశ్రామిక కాలుష్యం (పేజీ. 57)లో ఎన్నో అంశాలు చెప్పారు. ఈ రచయిత గతంలో కూడా "పాఠశాలలకు పర్యావరణ –పరిజ్ఞానం" మరియు "ఉన్నత పాఠశాలలకు పర్యావరణ పరిజ్ఞానం" అనే గ్రంథాలను రాశారు. ఇక ఈ గ్రంథంలో 11 అధ్యాయాలలో ఎన్నో పర్యావరణ అంశాలు విశ్లేషణగా అందరికీ అర్థం అయ్యేలా రాశారు. భూతలానికి నవ విపత్తులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్ – గ్లోబల్ వార్నింగ్), జల రక్షణే జన రక్షణ, పారిశ్రామిక కాలుష్యం – కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన భవిత, ప్రశాంత జీవనానికి పెనుముప్పు – ధ్వని కాలుష్యం – గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే ... అనే అధ్యాయాలే గాక, అన్నా హజారే, ఆదర్శ గ్రామం – ఉత్తరాఖండ్ విలవిల... వంటి ఎన్నో విషయాలను చర్చించి.. మానవ మనుగడకు పర్యావరణ ఆవశ్యకతను.. చక్కగా చెప్పారు రచయిత. అంతర్జాతీయ వ్యవహారాల్లో పెద్దన్నలా వ్యవహరించే అమెరికా పర్యావరణ విషయంలో సాగించే దుర్మార్గ వైఖరిని రచయిత శాతాల్లో అర్థమయ్యేలా చెప్పి, అమెరికా బండారాన్ని బయటపెట్టారు. అభినందనీయం.



- తంగిరాల చక్రవర్తి

పర్యావరణ చైతన్యం, రచన : ఆళ్ళ అప్పారావు, పేజీలు : 80, వెల : రూ.60/-, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీల్లో, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్ - 68

వస్తువులెక్కడ?



పిల్లలూ! ఈ బొమ్మలో తొమ్మిది వస్తువులు దాక్కున్నాయ్.. ఆ వస్తువులు ఎక్కడున్నాయో కనుక్కోండి చూద్దాం!



తేడా బొమ్మ

ఇక్కడున్న బొమ్మల వరుసలో ఒక బొమ్మ తేడాగా ఉంది. దాన్ని కనిపెట్టి సున్నా చుట్టేసేయండి.

బుజ్జిమేక - పందిపిల్ల

ఒక రైతు కొన్ని మేకలను, కొన్ని పందులను పెంచేవాడు. వాటిలో ఒక బుజ్జి మేక, ఒక చిన్న పందిపిల్ల ఉండేవి. బుజ్జి మేకను వాళ్లమ్మ ఎప్పుడూ చక్కగా స్నానం చేయించి శుభ్రంగా ఉంచేది. పందిపిల్లేమో వాళ్లమ్మతో బాటు బురదలో తిరిగేది. దాని ఒంటి నిండా బురద అంటుకునేది.

పందిపిల్ల ఎదురుపడగానే బుజ్జిమేక ముక్కు మూసుకుంటూ 'ఛీ... నువ్వు నా దగ్గరకు రాకు. కంపు. అవతలికి పో' అని చీదరించుకునేది.

పందిపిల్లకేమో ఆడుకోవడానికి స్నేహితులు లేరు. మేక పిల్లతో ఆడుకుందామంటే అదెప్పుడూ పందిపల్లను అసహ్యించుకునేది.

'అమ్మా నాకు స్నానం చేయించవే. ఇలా ఉంటే నాతో మేకపిల్ల ఆడుకోవట్లేదు' అని తల్లితో అంది పందిపిల్ల.

'చూడు బంగారం, మనం మనలాగే ఉంటాం. ఇంకోలా ఉండటం మనకు కుదరదు. మన శరీరానికి చెమటపట్టే లక్షణం లేదు. అందుకే ఎప్పుడూ మనం ఒంటిని తడుపుకుంటూ ఉండాలి.' అని తల్లి వివరించి చెప్పింది.

పందిపిల్లలకు ఇదంతా అర్థం చేసుకునే వయసు లేదు. కాసేపు వాళ్లమ్మతో గునిసింది. అమ్మ దాన్ని ఎంతో సముదాయించింది.

ఒకరోజు పందిపల్ల ఒకచోట, మేకపిల్ల ఒకచోట ఆడుకుంటున్నాయి. ఇంతలో దూరంగా ఉన్న కొండల మీదుంటే నక్క ఒకటి ఎలా పసికట్టిందో మేకపిల్లని పట్టుకుందామని అటువైపు వచ్చింది. మేకపిల్ల ఒంటరిగా ఉండటంతో ఆనక్కకి మరింత వీలు చిక్కినట్టయింది. నక్కి నక్కి వస్తున్న నక్కను చూసింది పంది పిల్ల.

'ఏయ్ పారిపో త్వరగా పారిపో...నక్కొస్తోంది...' అంటూ గట్టిగా కేకలు వేయడమే కాకుండా మేకపిల్ల పైకి దూకబోతున్న నక్కకి అడ్డు వెళ్లింది.

మేకపిల్లకు తగలాల్సిన దెబ్బ పందిపిల్లకు తగిలింది. ఈలోగా పందిపిల్ల అరుపు విన్న రైతు పరుగెత్తుకుని వచ్చాడు. అతన్ని చూడగానే నక్క పారిపోయింది. పందిపిల్ల గాయానికి మందువేసి బాగు చేశాడు రైతు. ప్రాణాలు అడ్డుపెట్టి తనను కాపాడిన పందిపిల్ల పట్ల తన ప్రవర్తనను తలుచుకుని సిగ్గుపడింది బుజ్జిమేక. ఆ తరువాత రెండూ ప్రాణ స్నేహితులయ్యాయి.

దారేది?

కొండ మీదున్న తన స్నేహితుడు బంటిని కలవాలనుకుంటున్నాడు చింటూ. కానీ దారి తెలియడం లేదు. ఆ దారేదో మీరు కనిపెట్టేస్తారా!



పూరిద్దాం

చిన్నారులూ! మీకు ఇంగ్లీషు బాగా వచ్చుకదా! అయితే కింద ఇచ్చిన పదాలతో గళ్లని నింపేసేయండి.



జవాబు :
1.corn, 2. turkey, 3.pumpkin, 4. grandma, 5. ship.

Word List: corn, grandma, pilgrim, pumpkin, ship, turkey

ఏడు తేడాలు

పై బొమ్మలూ చూడ్డానికి ఒకేలా ఉన్నాగానీ ఏడు తేడాలున్నాయి. ఆ తేడాలేంటో కనిపెట్టండి.

చేతులతో కుందేలు



మీకు తెలుసా! మన చేతి నీడలతో కూడా జంతువులు తయారవుతాయట! అదెలాగంటారా? రాత్రిపూట కొవ్వొత్తి వెలిగించిన గదిలో చేతుల్ని బొమ్మలో చూపించినట్టే పెడితే సరి. ఆ చేతుల నీడ ఆకారం అచ్చం కుందేలుగా కనిపిస్తుంది. ఒకసారి ప్రయత్నించండి.

చుక్కలు కలిపేద్దాం!

◆ సమ్‌థింగ్ స్పెషల్



అన్నదానం చేసినందుకు అరెస్టు

బీచ్‌లు, సరస్సులు, అటవీ ప్రాంతాలు, ప్రయివేటు కేంద్రాలలో ఒంటి మీద నూలు పోగు లేకుండా తిరగవచ్చు. పచ్చి బూతు సినిమాలు తీయటానికి, వాటిని ప్రదర్శించటానికి, చూడటానికి ఎలాంటి ఇబ్బంది లేదు. అదంతా వినోదం, కళాత్మకత. సరైన బట్టల్లేకుండా వీధుల్లో తిరిగినా, అడుక్కున్నా, పార్కులు, దుకాణాల ముందు కనిపించినా ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించే నేరం. కొలంబస్ కనుగొన్న ఆ నూతన ప్రపంచంలో అమలు జరుగుతున్న ఆధునిక న్యాయం. గత కొన్ని సంవత్సరాలుగా అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఫోర్ట్ లాడర్‌డాలే పట్టణంలోని బీచ్‌లో ఇళ్లు లేని పేదలకు ఆహారాన్ని దానం చేస్తున్న ఆర్నాల్డ్ అబోట్ అనే 90 సంవత్సరాల వృద్ధుడిని పోలీసులు న్యూసెన్స్ చట్టం కింద అరెస్టు చేశారు.

అనేక పట్టణాలలో ఇలా అన్నదానం చేయటాన్ని నిషేధిస్తూ చట్టాలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అన్నదానం చేస్తున్న తన స్వేచ్ఛను అడ్డుకోవటానికి హక్కు లేదంటూ ఆ పట్టణంలో కొత్తగా చేసిన చట్టాన్ని ఉల్లంఘించి ఆ వృద్ధుడు అన్నదానం చేయటంతో జైలు పాలయ్యాడు. పెట్టుబడిదారీ సమాజం ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో ఈ ఉదంతం వెల్లడిస్తోంది.

అంతులేని సంపదలున్నట్లు చెబుతున్న అమెరికాలో ఇళ్లు లేని వారు, అన్నార్తులు ఉండటం ఏమిటని కొంత మందికి సందేహం రావచ్చు. అక్కడ ఇళ్లులేని వారి జాతీయ సంస్థ గత నెలలో ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం ప్రతి ఆరుగురు అమెరికన్లలో ఒకరు ఆకలితో ఉంటున్నారు. అమెరికా మేయర్ల సదస్సు 2013లో ఆకలి, గూడు లేమి గురించి ఒక సర్వే చేయించింది. దాని ప్రకారం అంతకు ముందుటేడాదితో పోల్చితే ఆహారం కావాలని కోరుతున్న వారి సంఖ్య, ఎక్కువసార్లు అన్నదాన కేంద్రాలకు రావటం పెరిగినట్లు తేలింది.

అడుక్కొనే వారికి అయ్యో పాపంలే అని డబ్బులు ఇస్తే ఇక వారెన్నటికీ పని చూసుకోకుండా అడుక్కోవటాన్ని అలవాటుగా చేసుకుంటారు, అదే మనం ఇవ్వటం ఆపేస్తే వారు కనిపించరంటూ చెప్పే పేదరికాన్ని అసహ్యించుకొనే వారు మనకంటే ఎక్కువగా అమెరికాలో కనిపిస్తారు. అన్నదానం చేసే వారిని నిరుత్సాహ పరిచేందుకు ప్రస్తుతం ఒక బిల్లు తేవాలన్న ప్రతిపాదన ఉంది. దాని ప్రకారం అన్నదానం చేయాలనుకొనే వారు బహిరంగ ప్రదేశాలకు ప్రతి సారీ సంఖ్యను బట్టి వంద నుంచి 1250 డాలర్లు చెల్లించి అనుమతి తీసుకోవాలి. అది కూడా ఏడాదికి నాలుగు సార్లకు మించి అనుమతించరు. అనుమతి లేని ప్రయివేటు ప్రదేశాలలో అన్నదానం చేస్తే రెండువేల డాలర్ల జరిమానా వేస్తారు. ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయటానికి రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఇచ్చే విరాళాలపై ఎలాంటి పరిమితులు పెట్టకూడదని ఉన్నత న్యాయ స్థానం తీర్పు ! దాంతో ఇటీవలి ఎన్నికలలో 400 కోట్ల డాలర్ల ఖర్చు !! అదే గడ్డపై ఆకలితో ఉన్న అన్నార్తులు, అన్నదానంపై మాత్రం సవాలక్ష ఆంక్షలు !!!

ఆకలితో ఉన్నవారికి తన దగ్గర ఉన్నదానిని పంచమని, చలితో ఉన్న వారికి తన దగ్గర ఉన్న వస్త్రాన్ని తీసి కప్పమని చెప్పిన ఏసు క్రీస్తు ప్రవచించిన జాలి, దయ, విలువలు, సేవ, తాత్వికతను పాటిస్తున్నామని చెప్పుకొనేవారు ఆచరణలో అందుకు విరుద్ధమైన, వాటికి అవకాశం లేకుండా చట్టాలు చేయటం వింతగా ఉంది కదూ. 'తమ వద్ద ఉన్నదానిని ఇతరులతో పంచుకోవటం అనేది క్రైస్తవ విలువలలో అత్యంత ముఖ్యమైనది. ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని చూడటం మరొకటి. కానీ అమెరికా వాణిజ్యవేత్తలు తమ కార్పొరేట్ లాభాల పరిరక్షణ కోసమే క్రైస్తవం, అన్ని రకాల నైతిక సూత్రాలను వినియోగించుకుంటున్నార'ని హాస్యనటుడు రసెల్ బ్రాండ్ విమర్శించాడు. పట్టణాలలోని వాణిజ్యవేత్తలు తమ దుకాణాల సమీపంలో ఇళ్లులేని వారు, అన్నార్తులు కనిపిస్తే తమకు నష్టమని చెబుతారు. వారికి సానుభూతి చూపితే తమ వ్యాపారాల సంగతేమిటని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అమెరికన్లు క్రిస్మస్ సందర్భంగా అలంకరణలకు చేసే ఖర్చుతో లేని వారందరికీ ఇళ్లు కట్టించవచ్చని రసెల్ బ్రాండ్ వ్యాఖ్యానించాడు.

కొన్ని పట్టణ పాలక సంస్థలు ఇళ్లు లేని వారిపట్ల 'జాలి' చూపుతున్నాయి. ఉదాహరణకు కాలిఫోర్నియా రాష్ట్రంలోని మాంటెకా పట్టణ కౌన్సిల్ రెండు తీర్మానాలు చేసింది. డిసెంబరు నాలుగు తరువాత ఎవరూ రోడ్లు, పార్కుల వంటి ప్రభుత్వ, ప్రయివేటు బహిరంగ స్థలాలలో నిదురించటం లేదా గుడారాలు వేసుకోవటం కానీ నిషిద్ధం. వారిని జైలుకు పంపటం లేదా జరిమానాగానీ విధించకుండా పోలీసులకు పట్టిస్తారట. పార్కులను మూసివేసిన తరువాత జనాన్ని బయటకు పంపుతారు. అలాంటి వారు బయట మూత్రవిసర్జన వంటివి చేయకుండా మరో తీర్మానం ద్వారా నిషేధం విధించారు. ఇలా ప్రతి పట్టణం తీర్మానాలు చేస్తున్నది. వైకీకి వంటి హవాయి దీవుల నుంచి ఇళ్లు లేనివారిని బలవంతంగా విమానాలు ఎక్కించి ప్రధాన ప్రాంతాలకు పంపుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో 55లక్షల ఇళ్ల కొరత ఉందట.

పేదలే కాదు, ఇతర దేశాలపై యుద్ధాలకు వెళ్లి తిరిగి వచ్చిన మాజీ సైనికులు కూడా ఇళ్లు లేకుండా ఉన్న దుస్థితి అమెరికాలో ఉంది. ప్రస్తుతం అక్కడ 2.2కోట్ల మంది మాజీలు ఉన్నారు. దేశం మొత్తంగా 5.4శాతం మంది నిరుద్యోగులుంటే మాజీ సైనికుల్లో 4.5శాతం ఉన్నారని తాజా సమాచారం వెల్లడించింది. అదే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలలో పాల్గొన్నవారిలో 7.2శాతం నిరుద్యోగులని తేలింది. మాజీ సైనికులలో ఇళ్లు లేనివారి సమస్యను 2015 నాటికి పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందంటే ఇప్పుడు అందరికీ లేవని అంగీకరించినట్లే.

- సత్య

కానుక ఇవ్వడమూ కళే

పుట్టినరోజు, పెళ్లిరోజు... సందర్భం ఏదైతేనేం! ఇచ్చే కానుక అవతలివారి మనసుకు అద్దం పడుతుంటుంది. మీ ముందు కొలువుతీరిన చిత్రాలన్నీ ఓ భర్త తన భార్య పుట్టిన రోజు సందర్భంగా ప్రేమపూర్వకంగా సమర్పించుకున్నవేనంటే కుళ్లుకోకుండా వుండలేరు. చికాగోలో నివసించే ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ ఎర్నెస్ట్ బెర్లిన్ తన భార్య ఏగ్నెస్‌కు ఇచ్చిన బర్తడే గిఫ్ట్ పెద్ద వార్తే అయ్యింది. నిజానికి వీరిది అందమైన కుటుంబం. ఎర్నెస్ట్, ఏగ్నెస్, వారి తొమ్మిది నెలల బాబు జాకోబ్. అంతే. బిడ్డ కలిగాక తొలిసారిగా భార్య జరుపుకుంటున్న పుట్టినరోజు ఎప్పటికీ గుర్తుండిపోవాలనుకున్నాడు ఎర్నెస్ట్. తను తీసిన నలభై ఫొటోలను 23 మంది ఆర్టిస్టులకు పంపించి చిత్రాలు వేసిమ్మని అడిగాడు. వారు కూడా కాదనకుండా వేసి పంపారు. ఇదంతా 'రెడిట్' అనే వెబ్‌సైట్ ద్వారా జరిగింది. చిత్రకారులు పంపిన అన్ని బొమ్మల్లోకి ఏగ్నెస్ గుండెల మీద నిద్రపోతున్న జాకోబ్ చిత్రం అందర్నీ అమితంగా ఆకట్టుకుంది. 'ఈ చిత్రాలు... ఎర్నెస్ట్ ఇంటికే అందాన్ని తీసుకొచ్చాయి' అంటున్నారట అతగాడి స్నేహితులు, బంధువులు.



వావ్.. ఏం టోపీ!

ఈ వింత టోపీ ఎక్కడిది? అనుకుంటున్నారేమో! వియత్నాం వెళితే అక్కడ అడుగడుగున కనిపించే దృశ్యం ఇదే. బోర్లించిన మూకుడును పోలిన తెల్లటి శిరోభూషణంతో దర్శనమిస్తారు వియత్నాం వాసులు. వారి ముఖార విందాన్ని చూసి తరించాలంటే... కొద్దిగా తలెత్తమని బతిమాలాల్సిందే. మనకి తమాషాగా అనిపించినా వారికీ టోపీలు తప్పనిసరి. వియత్నాంలో వాతావరణం నిముషానికోలా మారిపోతుంటుంది. అప్పటి వరకు నిప్పులు చెరిగిన భానుడు టక్కున మాయమైపోతాడు. మరు క్షణంలోనే మబ్బులు పట్టేసి వర్షం మొదలౌతుంది. ఎండైనా వానైనా తట్టుకునేందుకు వీలుగా ఈ శిరోభూషణాలను వాడుతుంటారు వియత్నాం ప్రజలు. వీటిని ప్రత్యేకమైన ఆకులతో తయారుచేస్తారు. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా ఏ రంగంలో పనిచేసేవారైనా సరే ఈ టోపీలు లేకుండా అడుగు బయటకు పెట్టరంటే నమ్మండి. విదేశీయులెవరైనా ఆ దేశానికి వెళితే ఈ టోపీ ఒకటి తప్పక కొనుక్కొచ్చుకుంటారు. అదండీ వియత్నాంకు ఆ టోపీకి వున్న విడదీయరాని బంధం.